# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త






## రెండు వాహనాలు ఢీ

### తప్పిన ప్రమాదం - స్తంభించిన ట్రాఫిక్



తిరుమల,అక్టోబర్ 27ప్రభాతవార్తప్రతినిధి:
తిరుమలలో గురూవారం మధ్యాహ్నాం రెండు వాహనాలు ఢీకొన్నాయి. హెచ్‌విసి కూడలి వద్ద ఆర్టీసిబస్సు,యాత్రికుల వాహనాలు అదుపుతప్పి ఢీ కొన్నాయి. ఎవరికీ ప్రమాదం లేకపోయినా ట్రాఫిక్ సమస్య తలెత్తింది. యాత్రికుల రాకపోకల సమయంలో ఈ సంఘటన జరిగింది,

## రేణిగుంట విమానాశ్రయంలో

# ముఖ్యమంత్రికి ఘనస్వాగతం







ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తిరుపతి జిల్లా కలెక్టర్, ఎస్పీ

రేణిగుంట, అక్టోబరు 27 ప్రభాతవార్త:
రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి రేణిగుంట విమానాశ్రయంలో గురువారం ఘనంగా స్వాగతం లభించింది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని సర్వేపల్లి నియోజకవర్గం ముత్తుకూరు మండలంలో నేలటూరు గ్రామంలో ఏపీ జెన్కో శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్‌స్టేషన్ మూడో యూనిట్ ప్రారంభోత్సవంలో పాల్గొనటానికి రేణిగుంట విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, రాష్ట్ర భూగర్భ గనులు, అటవీ, విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, తిరుపతి నగర పాలక మేయర్ డా. శిరీష, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు భూమన కరుణాకర్‌రెడ్డి, కోనేటి ఆదిమూలం, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, టీటీడీ బోర్డు మెంబరు పోకల అశోక్‌కుమార్, తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఈఎంసీ క్లస్టర్ సీఈవో గౌతమి, తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ అనుపమ అంజలి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే కుమారుడు యువ నేత ఆకర్ష్‌రెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ రాజ్‌కిషోర్, సీఎస్‌వో రాజశేఖర్, డిప్యూటీ కమాండెంట్ శుక్లా, ఏఎస్పీ కులశేఖర్, జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌చార్జి అధికారి దయాసాగర్, జిల్లా ఫైర్ అధికారి రమణయ్య, ఆర్డీవో శ్రీకాళహస్తి రామారావు, డీఎస్పీలు రామచంద్రయ్య, చంద్రశేఖర్ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో నేలటూరు బయలుదేరి వెళ్లారు. ప్రారంభోత్సవంలో పాల్గొని అదే హెలికాప్టర్‌లో రేణిగుంట చేరుకుని వివిధశాఖల మంత్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులు వీడ్కోలు పలుకుతుండగా ప్రత్యేక విమానంలో గన్నవరం బయలుదేరి వెళ్లారు.

## దుమారం రేపుతున్న

# కల్యాణకట్ట క్షురకుల నిరసన!



### టిటిడి తప్పిదమా!? విజిలెన్స్‌కక్షసాధింపా?



తిరుమల,అక్టోబర్ 27ప్రభాతవార్తప్రతినిధి:
భక్తివిశ్వాసాలతో వెంకన్న భక్తుల తలనీలాలు తీస్తున్న కల్యాణకట్ట క్షురకుల నిరసన టిటిడిలో పెద్దదుమారాన్నే రేపుతోంది. భగవంతునిపై నమ్మకంతో, సేవాభావంతో సేవచేస్తున్న క్షురకులపై టిటిడి యాజమాన్యం విజిలెన్స్‌ను అడ్డుపెట్టుకుని కక్షసాధింపుధోరణితో వ్యవహరిస్తోందని క్షురకులు ఆరోపిస్తున్నారు. టిటిడి కల్యాణకట్టలో పీస్‌రేట్ క్షురకులుగా పనిచేస్తున్న కెకెటి సిబ్బందిని బలవంతంగా కార్పొరేషన్‌లోచేరలేదనే నెపంతో వేధింపులకు గురిచేస్తున్నారనే బలమైన ఆరోపణలు క్షురకులు బాహాటంగానే వ్యాఖ్యానిస్తున్నారు. భక్తులు ఎవరూ కూడా క్షురకులపై ఫిర్యాదు చేయకపోయినా విజిలెన్స్‌ను అడ్డుపెట్టుకుని ఇలా వేధించడం పై తీవ్రంగా నిరసనకు దిగారు. తిరుమలలో అటు భక్తులను ఇటు టిటిడి వర్గాలను కలవరపరిచింది. గురువారం ఉదయం ఉన్నఫళంగా ఐదుగంటలపాటు కెకెటి క్షురకులు పీస్‌రేట్ వాళ్ళు విధులను పక్కనపెట్టి తమ సమస్యలపై పోరాటానికి దిగారు. దీంతో పెద్దసంఖ్యలో శ్రీవారి భక్తులు తమ మొక్కుబడుల్లో తలనీలాలు సమర్పించి,దర్శనానికి వెళ్ళాల్సిన వాళ్లు నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. భక్తులు టిటిడి తీరుపై పెదవివిరిచారు. కల్యాణకట్టతో బాటు మినీకల్యాణకట్టల్లో సేవాభావంతో విధులు నిర్వహిస్తున్న క్షురకులపట్ల విజిలెన్స్ సిబ్బంది తీరు, వ్యవహారంపై భగ్గుమన్నారు. క్షురకుల లాకర్లు తనిఖీ చేయడం, బలవంతంగా బెదిరింపులకు గురిచేయడం చేస్తున్నారనే వాపోయారు. దీంతో గురువారం ఉదయం విధులను పక్కనపెట్టి సమస్యలపై పోరాటానికి దిగారు. తమందరినీ స్వేచ్ఛగా విధులు నిర్వర్తించుకునేలా టిటిడి యాజమాన్యం ఇఓ ఏవి ధర్మారెడ్డి కూడా సహకరిస్తున్నా కొందరు పని గట్టుకుని బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం విధులు బహిష్కరించి నిరసనకు దిగడంతో వీరికి సిఐటియు జిల్లా నాయకుడు సుబ్రమణ్యం మద్దతు తెలిపి, టిటిడి కార్పొరేషన్‌లో చేరే ప్రసక్తేలేదని, కల్యాణకట్టలో పీస్‌రేట్ క్షురకులు ప్రశాంతంగా సేవలందించేలా టిటిడి అధికారులు చొరవచూపాలని కోరారు. కెకెసి క్షురకులతో టిటిడి ఉద్యోగసంఘాల నాయకులు చర్చలు జరిపారు.

## షార్‌లో గగన్‌యాన్

# పరీక్షలు షురూ

శ్రీహరికోట (తడ), అక్టోబర్ 27 ప్రభాతవార్త



భారత ప్రతిష్టాత్మక గగన్‌యాన్ ప్రయోగానికి ఇస్రో కీలక పరీక్షలన్నింటినీ నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా శ్రీహరికోటలోని సతీష్ థవన్ స్పేస్‌సెంటర్‌లోనూ ఇప్పటికే పలు మోటార్ల స్థిర పరీక్షలు జరిపి ఉన్నారు. తాజాగా గురువారం క్రూ మాడ్యూల్ పరికరంలోని హెచ్‌ఇఎం అనే ఒక మోటారు పరీక్ష విజయవం తంగా నిర్వహించారు. గగన్‌యా న్‌లో క్రూమాడ్యూల్ పరికరం కీలకం కానుంది. ఇది ముందస్తుగా జరిగే మానవ రహిత గగన్‌యాన్ లలోనూ ఉపయోగిస్తారు. మూడు దశలుగా ఉన్న క్రూ మాడ్యూల్ మో టార్లలో ఇప్పటికి రెండుసార్లు స్థిర పరీక్షలు జరిపి ఉన్నారు. గగన్‌యాన్ పరీక్షలు పదేపదే నిర్వహించి అనంతరం అసలుసిసలైన ప్రయోగానికి ఇస్రో సిద్ధం కావాల్సి ఉంది. వాస్తవానికి ఈ డిసెంబర్‌లోనే మానవ రహిత ప్రయోగం జరపడానికి ఇస్రో శాస్త్రవేత్తలు ఉవ్విళ్లూరినప్పటికీ కొవిడ్ మహమ్మారి కారణంగా ఆ ప్రయోగం వాయిదా పడింది. ఇటీవల ఎల్‌వీఎం3 రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంతో మరోసారి గగన్‌యాన్‌పై ఇస్రో పూర్తి దృష్టి కేంద్రీకరించింది. మానవ రహిత, మానవ సహిత ప్రయోగాలు ఎల్‌వీఎం3 ద్వారానే జరపాల్సి ఉన్నందున, మొన్నటి ప్రయోగం ఇచ్చిన కిక్కుతో శాస్త్రవేత్తలు భవిష్యత్ ప్రయోగాలపై పూర్తి దృష్టి మరల్చారు. మరిన్ని భూకేంద్రాల పరీక్షలు పూర్తి చేసిన అనంతరం మానవ రహిత ప్రయోగం చేపట్టనున్నారు. ఇప్పటికే రష్యాలో మన వ్యోమగాములు శిక్షణ పొంది ఉన్నారు.

# గ్రామాల్లో పారిశుధ్యంకు అత్యంత ప్రాధాన్యం

### ఉపాధి లక్ష్యాలు పూర్తికి పక్కా ప్రణాళిక - బృందావన నిర్మాణాలు పూర్తికి చర్యలు - పంచాయతీరాజ్ ప్రత్యేక కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది



పంచాయతీరాజ్ ప్రత్యేక కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన డిఆర్‌ఓ రాజశేఖర్, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి తదితరులు

చిత్తూరు, అక్టోబర్ 27 ప్రభాతవార్త:
గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యంకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ప్రజలకు ఇబ్బందులు లేకుండా పక్కా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ ప్రత్యేక కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది అధికారులను ఆదేశించారు. విజయవాడ నుండి గురువారం పంచాయతీరాజ్ ప్రత్యేక కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అధికారులకు అందుబాటులో వుంచాలని నిర్ణయించి క్షేత్ర స్థాయిలో పలు ప్రభుత్వ భవనాలను నిర్మిస్తోందని, ఈ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. భవన నిర్మాణాల్లో చిత్తూరు జిల్లా అగ్రస్థానంలో వఉందని ఆయన పేర్కొన్నారు. ఉపాధి హామీ పనుల నిర్ధేశిత లక్ష్యాలు పూర్తి చేయడానికి పక్కా ప్రణాళిక రూపొందించి అమలు చేయాలన్నారు. అలాగే బల్క్ మిల్క్ సెంటర్ల నిర్మాణాలకు సంబంధించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే బృందావనాలు మంజూరుకు సంబంధించి ఎలాంటి జాప్యం జరుగకూడదని, నిర్మాణాలకు సంబంధించి ఎద్దైనా అనుమతులు పెండింగ్‌లో వుంటే సకాలంలో ఇవ్వాలని ఆయన అధికారులతో పేర్కొన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా వుంచుకోకుంటే వ్యాధులు ప్రబలే అవకాశం వుంటుందని, ప్రస్తుతం వర్షాలు కురిసే అవకాశం లేకపోవడంతో పారిశుధ్యంపై ప్రాధాన్యత ఇచ్చి పనులు పూర్తి చేసి గ్రామాలను పరిశుభ్రంగా వుంచాలన్నారు. అలాగే శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణాల్లో జాప్యం వద్దని గ్రామీణ ప్రాంతాల్లో వీటి నిర్మాణాలు ఎంతైనా అవసరం వుందన్నారు. శానిటరీ కాంప్లెక్స్ భవనాల నిర్మాణాలను సత్వరం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుండి జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్‌ఇ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ నాగజ్యోతి, డిఆర్‌పిసి షణ్ముగరామ్ తదితరులు పాల్గొన్నారు.

# కదలిన భూగర్భ విద్యుత్ కేబుల్ లైన్స్ ఏర్పాటు

### పరిశీలించిన సిఎండి సంతోష్‌రావు



నాలుగుమాడావీధుల్లో పరిశీలిస్తున్న సిఎండి

శ్రీకాళహస్తి,అక్టోబర్ 27 ప్రభాతవార్త
పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించిన నాలుగుమాడా వీధుల్లో భూగర్భ విద్యుత్ కేబుల్స్ ఏర్పాటుకు సంబంధించి సాధ్యాసాధ్యాలను గురువారం దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణి సంస్థ సిఎండి సంతోష్‌రావు పరిశీలించారు. వారితో పాటు విద్యుత్ శాఖ అధికారులు ఉన్నారు. ఈ ప్రాజెక్టుకు దేవస్థానం కూడా ఆర్థిక సహాకారం అందించాలని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి కోరారు.ఏడాదిగా ఈ ప్రాజక్టును అమలుకు శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి విద్యుత్‌శాఖ అధికారుల వెంటపడుతున్నారు.నాలుగుమాడావీధుల్లో శివరాత్రి రథోత్సవం పర్వదినాన విద్యుత్ తీగలను తాత్కాలికంగా తొలగించి మరల అమర్చటం రోజంతా కరెంటు సరఫరాకు అంతరాయం కల్గుతుంది. దాంతో వ్యాపారులు,యాత్రికులకు ఇబ్బంది కల్గుతుంది.ఈ అంతరాలను తొలగించుటకు విద్యుత్ శాఖాధికారులు ప్రతిపానలు రూపొందించి కార్పొరేట్ ఆఫీస్‌కు పంపటం జరిగింది.ఈ ప్రతిపాదనల అమలు సాధ్యాసాధ్యాలను గురువారం ఉన్నతాధికారులు పరిశీలించారు. సిఎండి సంతోష్‌రావు పరిశీలించి అధికారులు రూపొందించిన ప్రణాళికలతో పాటు తగు సూచనలు చేసారు.నాలుగుమాడావీధుల్లో కేబుల్‌ఏర్పాటుకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆయన స్వతహాగా పరిశీలించారు.ఇక వ్యవసాయ విద్యుత్ సరఫరాకు, విద్యుత్ బకాయిల గురించి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఎండి సూచించారు.ఆయనతో పాటు సిఎండి కార్యాలయం నుంచి గంగాధర్, వేణుగోపాల్, తిరుపతి ఎఇఇ కన్‌స్ట్రక్షన్స్ నాగరాజు, శ్రీకాళహస్తి డెప్యూటి ఇఇ సతీష్,బాబు, ఎఇఇలు చెంచుకృష్ణ, కుమార్,బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఉష్ణోగ్రతలు

27/10/2022



- తిరుపతి 31 డిగ్రీలు
- చిత్తూరు 33 డిగ్రీలు
- మదనపల్లి 26 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 33 డిగ్రీలు
- వెంకటగిరి 34 డిగ్రీలు
- గూడూరు 34 డిగ్రీలు

## బంగారం ధరలు

27/10/2022



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 4,745

24క్యారెట్స్ 1గ్రాము రూ.5,176

## కోడిగ్రుడ్ల ధరలు

27/10/2022



కోడిగ్రుడ్డు :రూ.6.00

1 డజను: రూ.72.00

## నేటి నుండి భరోసా కేంద్రాలలో

# ఖరీఫ్‌సాగు రైతుల జాబితా ప్రదర్శన

### ఈ-క్రాప్‌తో రైతులు ఉచిత బీమాకు, సున్నా వడ్డీ, ఇన్‌పుట్ సబ్సిడీకి అర్హులు

### జిల్లాలో 445 రైతు భరోసా కేంద్రాలు, 315 కస్టమ్ హైరింగ్ సెంటర్లు

తిరుపతిరూరల్ - ప్రభాతవార్త:
రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ-క్రాప్, ఈ.కే.వై.సి నమోదులో భాగంగా జిల్లాలో 60,749 మంది రైతులు ఖరీఫ్-2022 సాగు 1,51,398 ఎకరాల వివరాలను ఈనెల 28 నుండి 31వరకు సంబంధిత రైతు భరోసా కేంద్రాలలో జాభితాను అందుబాటులోకి ఉంచనున్నారు. ఈ విధానంతో రైతుల పంట నమోదులు తేడా ఉంటే సరిచూసుకుని, వ్రాతపూర్వకంగా అందించ గలిగితే అధికారులు వివరాలను పరిశీలించి సరి చేయనున్నారు. అనంతలరం జాభితాను నవంబర్ 2న రైతుభరోసా కేంద్రాలలో అందుబాటులో ఉంచనున్నారు. గ్రామ వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ సహాయకులకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ-క్రాప్ నమోదు, ఈ.కె.వై.సి. నమోదుతో వైయస్సార్ ఉచిత భీమా, సున్నా వడ్డీ పంట ఋణాలు, ఇన్‌పుట్ సబ్సిడి, కనీస మద్దతు ధరకు రైతలు అర్హులు కానున్నారు. జిల్లాలోని 315 కస్టమ్ హైరింగ్ సెంటర్ల ద్వారా రైతు సంఘాలకు మెగా మేళా నిర్వహించి వైయస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా 165 ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు తక్కువ ధరకే రైతుల వినియోగానికి అందుబాటులోకి తీసుకువచ్చారు.

**పర్యవేక్షణ అధికారుల తనిఖీ : (సూపర్ చెక్)**

సచివాలయ సిబ్బంది చేపట్టిన వివరాలు ఖచ్చితంగా వివిధ స్థాయిలలో తనిఖీ నిమిత్తం సాంకతిక పరిజ్ఞానంతో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్.డి.ఓ.లు, డి.ఎ.ఓ.డి.హెచ్, ఎ.డి.ఎ, ఎం.డి.ఎ, తహశీల్దార్స్‌కు గ్రామంలో పర్యటించిన పరిశీలించాలో సమాచారం అందుతుందని, ఆ మేరకు అధికారులు సూపర్ చెక్ విధానంతో పర్యటించి పంటలతో పాటు రైతు వివరాలను అడిగి తెలుసుకునే ప్రక్రియ పూర్తి అవుతుంది. అన్ని రైతు భరోసా కేంద్రాలలో నవంబర్ 2న ఈ-పంట తుది జాభితా ప్రదర్శనతో రైతులకు రైతు సంక్షేమ పథకాలు అందనున్నాయి.



నాయుడుపేట మండలం పుదూరు గ్రామ రైతులతో కలెక్టర్ వెంకటరమణారెడ్డి

**పారదర్శకంగా జాబితా అందుబాటులోకి: కలెక్టర్ వెంకటరమణారెడ్డి**

వీఆర్వో స్థాయి నుండి ఆర్డీఓ, జాయింట్ కలెక్టర్, జిల్లా కలెక్టర్ ఈ.కె.వై.సి పరిశీలనతో పారదర్శకంగా సాగు రైతుల జాభితా అందుబాటులోకి వస్తుందని కలెక్టర్ వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. భూమి మీద ఉన్న రైతుకే ఈకెవైసి వల్ల ప్రభుత్వ పథకాల లబ్ది చేకూరుతుందన్నారు. జిల్లాలో 97.1 శాతం ఈ.కె.వై.సి. పూర్తయిందని, రేపటి నుండి రైతులకు జాబితాను రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు.

**పథకాలు పకడ్బందీగా అమలు: జె.సి. డి.కె.బాలాజీ:**

రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు పకడ్బందీగా అమలు జరిగేలా చర్యలు చేపడుతున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ డి.కె.బాలాజీ పేర్కొన్నారు. ప్రభుత్వం సూచించిన సూపర్ పవర్ చెక్‌లో భాగంగా వెంకటగిరి, సూళ్ళూరుపేట మండలాల్లో రైతుల ఖాతా మేరకు ఈ-క్రాప్ నమోదు పరిశీలించడం జరిగిందన్నారు.

# మాటలతో ప్రదక్షిణలు చేసేవారిని దరి చేరనివ్వను

### కుప్పం నియోజకవర్గ సమీక్షా సమావేశంలో చంద్రబాబు



కుప్పం, అక్టోబర్ 27 ప్రభాతవార్త
పార్టీ కోసం పనిచేయకుండా కేవలం మాటలు చెబుతూ.. తన చుట్టూ ప్రదక్షిణలు చేయాలనేకునే వారిని దరి చేరనివ్వనని తెలుగుదేశం పార్టీ అధినేత, ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. గురువారం రాత్రి కుప్పం నియోజకవర్గ తెదేపా నేతలతో చంద్రబాబు నాయుడు సమీక్షా సమావేశంను విజయవాడలో నిర్వహించారు. ఈ సందర్భంగా అధినేత మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ పట్ల ప్రజల్లో విశ్వాసం మరి ంత పెరిగి ందని ప్రజలకు అన్ని విధాలా అండగా ఉంటూ వారి సమస్యలపై పోరాటం చేయాలని నేతలకు సూచించారు. తెదేపా పట్ల ప్రజలు సానుకూలంగా ఉన్నారని పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడి క్షేత్రస్థాయిలో పనిచేసే నేతలు, కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇస్తానని అలాగే పార్టీ కోసం పనిచేయని ఏ స్థాయి కేడర్ ్ద నేత అయినా సరే దండం పెట్టి పంపించేస్తానని స్పష్టం చేసినట్లు తెలిసింది. పార్టీకి ఎవరైతే కష్టపడతారో వారికి అన్ని విధాలా అండగా ఉంటానని పేర్కొన్నారు. నాయకుడనేవ్యక్తి ఓ మెట్టు దిగి పార్టీ కార్యకర్తలు, కేడర్‌ను కలుపుకుపోవాల్సిన అవసరం ఉంద న్నారు. అలా కాకుండా పార్టీ కోసం పనిచేయక తన వద్ద కేవలం మాటలతో సరిపుచ్చితే తాను ఎంతమాత్రం సహించే పరిస్థితి లేదని స్పష్టం చేసినట్లు సమాచారం. కుప్పం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నేతలపై నమోదైన కేసులు ఉన్మాద చర్య అని, పోలీసుల తీరు రాష్ట్రంలో ఉన్న అందరికీ తెలిసిందన్నారు. వైకాపా నేతలు బనాయించే అక్రమ కేసులకు ఎవరూ భయపడొద్దని తాను అన్ని విధాలా అండగా ఉంటానని నేతలు, కార్యకర్తలకు అధినేత భరోసా కల్పించారు. కుప్పం, హిందూపురం నియోజకవర్గాల్లో గత కొన్నేళ్లుగా కేవలం ఒకే సింబల్‌తో తెలుగుదేశం పార్టీ గెలుస్తూ వస్తోందని కుప్పం ప్రజలు తెలుగుదేశం పార్టీ, తన పట్ల అత్యంత విశ్వాసం కలిగి ఉన్నారన్నారు. ఈ పరిస్థితి వేరే నియోజకవర్గాల్లో ఎక్కడా లేదన్నారు. పులివెందులలో సింబల్ మారిందనే విషయం గుర్తు చేశారు. పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. వైకాపా ప్రభుత్వ వైఫల్యాలు ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని ఆదేశించినట్లు సమాచారం. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా మరలా అధికారంలో రావడం ఖాయమని అధినేత చంద్రబాబు స్పష్టం చేశారని తెలిసింది. కుప్పం నియోజకవర్గంలో తాను నవంబర్ నెల ద్వితీయార్థంలో పర్యటిస్తానని బాబు నేతలకు సూచించినట్లు సమాచారం. సమావేశంలో ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్ బాషా, చంద్రబాబు కార్యదర్శి మనోహర్, మండల పార్టీ అధ్యక్షులు ప్రేమ్‌కుమార్, రాజ్‌కుమార్, బాబునాయుడు, ఆనందరెడ్డి, విశ్వనాథనాయుడు, నేతలు జిఎం రాజు, త్రిలోక్, మునస్వామి, ఎవి రవి, రామచంద్ర, బిఎంకె రవిచంద్ర, మణి, సుబ్బు, హేమాంబర గౌడు,

# రక్తదానం ప్రాణదానంతో సమానం
## - అడ్మిన్ అడిషనల్ ఎస్పీ జగదీష్

చిత్తూరు, అక్టోబర్ 27 ప్రభాతవార్త:
రక్తదానం ప్రాణదానంతో సమానమని అడ్మిన్ ఎఎస్పీ జగదీష్ పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవాల్లో భాగంగా గురువారం పిజిఆర్ పోలీస్ క్వాటర్స్ ఆవరణలో పోలీసుల రక్తదాన శిబిరంను అడ్మిన్ ఎఎస్పీ జగదీష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా గురువారం రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లా కేంద్రం చిత్తూరులో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారుల పర్యవేక్షణలో పోలీసు శ్వేద మహిళల బ్యారక్ నందు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ప్రతి ఏటా పోలీసు అమరవీరుల సంస్మరణ



దినోత్సవాలను అక్టోబర్ 21 నుండి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఎఎస్పీ జగదీష్ రక్తదానం చేయడంతో పాటు రక్తదానం చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించారు. అలాగే ఈ రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేయడానికి కళాశాల విద్యార్థులు, ప్రజలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్స్ అడిషనల్ ఎస్పీ కెవి శ్రీనివాసరావు, చిత్తూరు నగర డిఎస్పీ సుధాకర్‌రెడ్డి, ట్రాఫిక్ డిఎస్పీ తిప్పేస్వామి, ఎస్‌బి డిఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఏఆర్ డిఎస్పీ లక్ష్మీనారాయణరెడ్డి, ఆర్ఐలు నీలకంఠేశ్వరరెడ్డి, మధులు, చిత్తూరు వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ నరసింహరాజు,టుటౌన్‌ఇన్స్‌పెక్టర్ యతీంద్ర, వెస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఈస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మద్దయ్యచ్చారి, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, పోలీస్ వెల్ఫేర్ హాస్పిటల్ డాక్టర్లు, నగర ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్
చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఆర్టీసీ సమస్యలపై డిఎంకు ఉద్యోగుల వినతిపత్రం
కుప్పంరూరల్, అక్టోబర్ 27 ప్రభాతవార్త



కుప్పం ఆర్టీసీ డిపోలో నెలకొన్న వివిధ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆర్టీసీ ఎన్ఎంయుఎ డిపో కార్యదర్శి జయపాల్, ఇతర ఉద్యోగులు కలసి వినతిపత్రంఅందించారు. పెండింగ్‌లోఉన్న ఎడిసిలను ఫష్లింగ్ చేయాలన్నారు. డ్రైవర్లకు క్రూచాట్ రూపొందించాలన్నారు. తిరుపతికి వెళ్ల బస్సులు బైపాస్‌రోడ్‌లో వెళ్లేలా చర్యలు చేపట్టాలన్నారు. డిపోకు స్పేర్ పార్టులు సరఫరా చేయాలన్నారు. డిపో క్వార్టర్స్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. అలాగే వివిధ సమస్యలపై వినతిపత్రం అందించారు.

## 31నుంచి వైకాపా పంచాయతీ,మండల కమిటీల సమావేశం
శాంతిపురం, అక్టోబర్ 27 ప్రభాతవార్త

శాంతిపురం మండల వైకాపా పంచాయతీ, మండల కమిటీల సమావేశాలు ఈనెల 31వతేది నుంచి జరుగుతాయని మండల కన్వీనర్ దండపాణి తెలిపారు. 31న సొన్నేగానిపల్లి, మఠం, ఎంకెపురం, దండ కుప్పం, నవంబర్1న కొలమడుగు, శివరాంపురం, అబకలదొడ్డి, తుమ్మిశి, 2న మొరసనపల్లి, కడపల్లి, కర్లగట్ట, గుంజార్లపల్లి, 3న నడింపల్లి, చిన్నారిదొడ్డి, కెనమాకులపల్లి, 4న రేగడదిన్నేపల్లి, అనికెర, 121 పెద్దూరు, చెంగుబళ్ల, 5న కోనేరుకుప్పం, రాళ్లబూదుగూరు, 64 పెద్దూరు, సి.బండపల్లిలో సమావేశాలు జరుగుతాయన్నారు.

## వెదురుకుప్పం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా కందుకూరి హుమేష్
వెదురుకుప్పం, అక్టోబర్ 27 ప్రభాతవార్త :



మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా కందుకూరి హుమేష్‌ను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సురేష్ బాబు గురువారం ఉత్తర్వులు జారీ చేసిన్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు. హుమేష్ గతంలో మండల పార్టీ యువజన కార్యదర్శిగా, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులుగా సేవలందించారు. ఆయన సేవలను దృష్టిలో పెట్టుకుని మండల అధ్యక్షులుగా నియమించిన్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా హుమేష్ మాట్లాడుతూ తనకు పదవి రావడం పార్టీలో మరింత బాధ్యత పెరిగిందన్నారు. పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతంకు కృషి చేస్తానన్నారు.

## జోరుగా రైతు భరోసా కేంద్రం, ట్యాంకు నిర్మాణ పనులు
వెదురుకుప్పం, అక్టోబర్ 27 ప్రభాతవార్త :



మండల కేంద్రంలోని రైతు బరోసా కేంద్రం, ట్యాంకు నిర్మాణ పనులు జోరుగా జరుగుతున్నాయి. గురు వారం నిర్మాణ పనులను ఎంపిడివో సుధాకర్‌రావు, రాష్ట్ర వైసీపీ నేత డిగ్రీ కళాశాల ఛైర్మెన్ బండి గోవర్ధన్ రెడ్డి పరిశీలించారు. వారు మాట్లాడుతూ పనులు వేగంగా ప్రభుత్వం చూచిన విధంగా న్యాణత ప్రమాణాలు పాటించి నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణ పనులు వేగంగా చేయడం పై వైసీపీ నాయకులు రామయ్యను అభినందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి సభ్యులు చల్లం పాళ్యం సుకుమార్, స్థానిక నాయకులు మరకాలకుప్పం రామయ్య, పొన్నయ్య, వెంకటాచలం, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## ముద్దచర్మ వ్యాధిపట్ల పాడిరైతులు అవగాహన పెంపొందించుకోండి.
పెద్దపంజాణి అక్టోబర్ 27 ప్రభాతవార్త :



పశువులకు సోకుతున్న ముద్దచర్మవ్యాధిపట్ల పాడి రైతులు అవగాహన పెంపొందించుకోవాలని వాటి నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని సింగిల్ విండో అధ్యక్షులు శంకరప్ప, సర్పంచ్ అర్చన పృధ్వీనాథ్‌లు సూచించారు. మండలంలోని బట్టందొడ్డి పంచాయతీ దాసార్లపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన పశు వైద్య శిబిరంలో వారు మాట్లాడుతూ బయట ప్రాంతా లలో కొన్ని పశువులు ముద్దచర్మ వ్యాధి బారిన పడి మృత్యువాత పడుతున్నాయని అందుకోసం ముంద`స్తు చర్యల్లో భాగంగా ఈ వ్యాధి నిర్మూలనకు గోట్‌ఫాక్స్ వ్యాక్సిన్ వేయిస్తున్నట్లు తెలిపారు. పెద్దపంజాణి ఇన్చార్జ్ పశువైద్యాధికారి సరిత సహకారంతో సచివాలయ అసిస్టెంట్లు,గోపాలమిత్రలు గ్రామాల్లో పశువైద్యశిబిరాలను నిర్వహించి పాడిపశువులకు ఉచితంగా ముద్దచర్మవ్యాధి నిర్యాలనకు వ్యాక్సిన్లు వేస్తున్నారనిఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని పాడిపశువులకు వాక్సిన్లు వేయించుకోవాలని సూచించారు.

## ధనుంజయ నాయుడుకు అరుదైన గుర్తింపు
- యునిటైడ్ నేషన్స్ డే అవార్డు ప్రదానం



పెద్దపంజాణి అక్టోబర్ 27 ప్రభాతవార్త :
మండలంలోని కోగిలేరు పంచాయతీ చీకలదిన్నే పల్లికిచెందినధనుంజయనాయుడుకిఅరుదైన గుర్తింపు లభించింది. సివిల్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్న ధనుంజ యనాయుడు పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. ఈసేవాకార్యక్రమాలనుగుర్తించిన యునిటై డ్ నేషన్స్ డే బుధవారం గుంటూరు నందు జరిగిన అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో ధనుంజయ నాయుడుకు అవార్డుఅందజేయడంజరిగింది. దీనిపైగ్రామంలోనిప్రజలు, పలువురునాయకులుఆయననుఅభినందించారు.

## టిటిడి క్షురకులపై అధికారుల దౌర్జన్యం దారుణం
- తెదేపా స్టేట్ నాయీ బ్రాహ్మణ కన్వీనర్ శాంతారా ం

కుప్పం, అక్టోబర్ 27 ప్రభాతవార్త



తిరుమలలోని కళ్యాణ కట్ట వద్ద గురువారం విజిలెన్స్ అధికారి పట్టాభి అక్కడ విధుల్లో ఉన్న క్షురకులపై దౌర్జన్యానికి దిగడం దారుణమని తెదేపా రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సాధికార కమిటీ కన్వీనర్ వైద్య ం శాంతారాం పేర్కొన్నారు. క్షురకుల వద్దకు వచ్చిన అధికారి చెకింగ్ పేరిట అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు మంగలోడా, మంగలి నా కొడకా అంటూ పత్రికల్లో రాయలేని పదజాలంతో దూషించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లాకర్లు పగలగొట్టి, సెల్‌ఫోన్లు లాక్కుని భీభత్సం సృష్టించడం దారుణమని ఇది మంచి పద్ధతి కాదన్నారు. వెంటనే సంబంధిత అధికారి క్షురకులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కత్తిడౌన్ కార్యక్రమం చేపట్టిన కేశఖండన కార్మికులకు తాము సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. కోర్టులో ఉన్న వారి అందరికి ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని లేకుంటే ఉద్యమబాట చేపడ్తామని హెచ్చరించారు.

## తెదేపా సీనియర్ నేత మృతి.. చంద్రబాబు సంతాపం
కుప్పం, అక్టోబర్ 27 ప్రభాతవార్త

రామకుప్పం మండలం చిక్కపల్లి తాండాకు చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత రామదాసు నాయక్ మృతి చెందారు. ఈయన మృతి పట్ల తెదేపా అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని వారి కుటుంబానికి భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని కోరారు.

## నిరక్ష రాస్యుల జాబితాపై ర్యాడమ్ సర్వే
గంగాధరనెల్లూరు, అక్టోబర్ 27 ప్రభాతవార్త :



మండలంలోని వీరక నెల్లూరు సచివాలయ పరిధిలో గురు వారం జిల్లా వయోజన విద్య శాఖ ఏపిఒ హరినాథ్ రెడ్డి నిరక్షరాస్యుల ర్యాడమ్ సర్వేను నిర్వహించారు. సచివాలయ పరిధిలో 15 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల లోపు వయసువారు349మంది నిరక్షరాస్యులుగా సిబ్బంది సర్వేలో గుర్తించారని వీరిలో 63 మందిని కలిసి వీరిలో చదువుకున్న వారు ఎంత మంది చదువుకోని వారు ఎంతమంది చనిపోయిన వారిని గుర్తించి జాబితాను తయారు చేశారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు టి. కందేశ్వర రావు,డబ్లూసి ఎఆర్ పల్లవిలతో పాటు పలువురు నిరక్షరాస్యులుపాల్గొన్నారు.

## ఎక్స్‌ప్రెస్ హైవే స్థలాల్లో నిర్మాణాలు వుంటే సత్వరం ఖాళీ
- తహసిల్దారు బాబు రాజేంద్రప్రసాద్

గుడిపాల, అక్టోబర్ 27 ప్రభాతవార్త:



గుడిపాల మండల పరిధిలో ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మా ణానికి సంబంధించి ప్రభుత్వం గుర్తించిన స్థలాల్లో ఏదైనా నిర్మాణాలువుంటే సత్వరంవాటిని పడగొట్టి ఖాళీ చేయాలని తహసిల్దారు బాబు రాజేంద్రపసాద్ స్పష్టం చేశారు. 190 రామా పురంలో ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి సంబంధించి భూములు కొల్పోయిన రైతులతో గురువారం తహసిల్దారు బాబు రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు, ప్రజలతో తహసిల్దారు మాట్లాడుతూ భూములు కొల్పోయిన రైతులకు ఒక ఏడాది క్రితమే నష్టపరిహారం చెల్లించడం జరిగిందన్నారు. సంబంధిత ప్రాంతాల్లో ఎద్దైనా నిర్మాణాలు వుంటే ఖాళీ చేసి ఆ స్థలాలను హైవే అధికారులకు అప్పగించాలని స్పష్టం చేశారు. అలాగే రైతులు ఎవరైనా ఎక్స్‌ప్రెస్ హైవేనిర్మాణానికిభూములుఇవ్వమనిఅభ్యంతరంతెలిపితేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామన్నారు.

## నేడు మున్సిపల్ కార్పొరేషన్ అత్యవసర సమావేశం
చిత్తూరు, అక్టోబర్ 27 ప్రభాతవార్త:

చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలను జరుగుతుందని మేయర్ అముద, కమీషనర్ డాక్టర్ జె.అరుణలు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి కార్పొరేటర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులు, కో-అప్షన్ సభ్యులు, అధికారులు హాజరు కావాలని వారు కోరారు.

# గర్జనలు కాదు ఉపాధి, ఉద్యోగాలు కావాలి
## - తెలుగుదేశం నేతలు ధ్వజం

చిత్తూరు, అక్టోబర్ 27 ప్రభాతవార్త:
రాయలసీమ ప్రజలకు గర్జనలు, గాండ్రింపులు అవసరం లేదని ఉపాధి, ఉద్యోగాలు కావవాలని జిల్లా తెలుగుదేశం నాయకులు ధ్వజమెత్తారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్ తదితరులు మాట్లాడుతూ తిరుపతిలో శనివారం జరుగనున్న రాయలసీమ గర్జన సభపై విమర్శలు ఎక్కుపెట్టారు. చంద్రబాబునాయుడు సిఎంగా వున్న సమయంలో



జిల్లాకు పలు పరిశ్రమలను తీసుకువచ్చారని మూడున్నర సంవత్సరాల పాటు సిఎంగా వున్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జిల్లాకు ఏ ఒక్క పరిశ్రమ తీసుకురాలేదని విమర్శించారు. అమరావతి రైతులనుఒప్పించిరాజధానినిర్మాణంకోసంఅప్పటిసిఎం చంద్రబాబు నాయుడు 33 వేల ఎకరాలను తీసుకొన్నారన్నారు. ప్రస్తుత ప్రభు త్వం రాష్ట్ర వ్యాప్తంగా పరిశ్రమలను తీసుకువచ్చి నిరుద్యోగులకు ఉపా ధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, ఎస్సీ సెల్ నాయకులు మేషక్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్
గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## సీఎంను కలిసిన వైసీపీ నేత దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి
ఓజిలి, అక్టోబర్ 27 ప్రభాతవార్త



నెల్లూరు జిల్లా పర్యటనకు గురువారం వచ్చిన ముఖ్యమంత్రివై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నివైసీపీ నాయకులు దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి కలిసి స్వాగతం పలికారు. జనరంజన పాలన చేస్తున్న ముఖ్యమంత్రి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సారధ్యంలో మర్యాదపూర్వకంగా కలిసిన దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి సీఎంకు పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మధు అన్నా బాగున్నావా, సంజీవన్నకు తోడుగా ఉండండి అని సీఎం జగన్ పలకరింపుతో మధుసూదన్‌రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు.

## వైసిపి నాయకులు గురుస్వామికి పలువురు పరామర్శ
కోట,అక్టోబర్ 27 ప్రభాతవార్త

కోట మండలం కేశవరం పంచాయతీలోని వైకాపా సీనియర్ నాయకుడు శ్రీరామ్ గురుస్వామి తండ్రి గురువయ్య బుధవారం మృతి చెందారు. ఆమేరకు గురుస్వామిని డివిజన్‌లో వైకాపా నాయకులు ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్, నరమాల వెంకటరమణయ్య, తిరుపతి వైకాపా పార్లమెంట్ మైనాటి నాయకులు మొబిన్‌భాష,,రాష్ట్ర బిసి నాయకులు పి.ఎల్.రావు, ధర్మరాజు స్వామి దేవస్థానం ట్రస్టబోర్డు ఛైర్మెన్, బొమ్మిడిశ్రీనివాసులు, మాజీ జిడ్పిటిసి ఉప్పల ప్రసాద్‌గౌడ్, మాజీ ఎంపిటిసి, మర్రిబోయిన కృష్ణయ్య, వెంకనపాళెం, సర్పంచ్ కె.మధుసూదన్‌యాదవ్, గుత్తవారిపాలెం సర్పంచ్, నారాయణ, పిట్టువానికండ్రిగ సర్పంచ్ ప్రవీణ్, మాజి సర్పంచ్ సతీష్, మద్దాలి మాజీ సర్పంచ్ కోటీశ్వరనాయుడు,మోమిడి మాజీ సర్పంచ్ వెంకటకృష్ణయ్య, కేశవరం ఉపసర్పంచ్ సుబ్బయ్య, వైసిపి నాయకులు ప్రభాకర్ గౌడ్, తోణకుమాల ఉప సర్పంచ్ భాస్కర్‌లు గురుస్వామిని పరామర్శించారు. ఆయన కుంటుభానికి ప్రగాడ సంతాపం తెలిపారు.

## అగ్ని ప్రమాదంతో నిరాశ్రయులైన దళిత కుటుంబం
వాకాడు, అక్టోబర్ 27, ప్రభాతవార్త



వాకాడు మండలం కాశీపురం గ్రామానికి చెందిన పేద దళితుడైన సురేష్ పూరి గుడిసె అగ్ని జ్వాలలకు కాటేసాయి. స్థానిక బాధి తుల వివరాల మేరకు బుధవారం అర్ధరాత్రి అకస్మాత్తుగా మంటలు రావడం అప్పుడే సురేష్ కుమార్తె నిద్ర లేవడం ఆ మంటలు చూసి తల్లిదండ్రులకు చెప్పడంతో హడావుడిన ఇంట్లో నుండి బయటకు రావడంతో ప్రాణాలు కాపాడుకున్నారు. ఇంట్లో ఉన్న దాదాపు 50 రూపాయిలు నగదు విలువైన వస్తువులు వంటసామగ్రి పూర్తిగా అగ్ని జ్వాలలో మింగేశాయి. ఆ పాప నిద్ర లేవకుంటే ఆ ముగ్గరు దాహమై ఉండేవారు. ఆ ప్రమాదంతో కుటుంబం వీధిన పడింది. ఆ కుటుంబం రోజువారి వస్తులు చేసుకుని జీవనం సాగించే వారని స్థానికులు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరారు.

## ఆధార్‌ను ప్రతి ఒక్కరూ అప్డేట్ చేసుకోండి
వాకాడు, అక్టోబర్ 27, ప్రభాతవార్త



మండలంలోని ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఆధార్‌ను అప్డేట్ చేసుకో వాలని ఎంపిడిఒ గోపినాధ్ తెలిపారు. మండలంలోని తిరుమూరు, బాల్ రెడ్డి పాలెం గ్రామాలలో ఆధార్ సెంటర్లును సచివాలయంలోని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆధార్ కేంద్రాల్లో అప్డేట్ ప్రజలు చేసుకుంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ గోపినాధ్ మాట్లాడుతూ తిరుమురు, బాల్ రెడ్డి పాలెం మాలలో ఉన్న సచివాలయంలో పని తీరు ఆయన పరిశీలించి తగు సూచనలు సలహాలు అందజేశారని తెలిపారు.

**SRIKALAHASTI MUNICIPALITY**
**'e' PROCUREMENT- Tender NOTICE**
**Commissioner, Srikalahasti Municipality**
has invited tenders for the 7 works vide **Tender Notice**
***NIT No.48, 49, 63, to 67/2022-23, Dated: 26.10.2022 with an estimated Cost of Rs. 91.58 lakhs***
The Municipal Commissioner is empowered either cancellation/ postpone/ modification of the Tenders, Further Details can be seen at Office Notice Board and 'e'Procurement Market place @ http:// tender.apeprocurement.gov.in
**Sd/- B.Balaji Naik, Commissioner, Srikalahasti Municipality**

# అందరికీ వైద్యమే ఫ్యామిలీ డాక్టర్ లక్ష్యం
## - జడ్పీటీసీ రవీంద్రరాజు

ఓజిలి, అక్టోబరు 27 ప్రభాతవార్త:
గ్రామంలో వైద్య సేవలు తిరుపతి జిల్లా ఓజిలి మండలం పెద్దపరియ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆరిమేని పాడు సచివాలయంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని 104 ఆధ్వర్యంలో మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ మాధవ, డాక్టర్ హరి సుహాస్‌రెడ్డి, డాక్టర్ జి.శివ వినీషా ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఫ్యామిలీ ఫిజియన్ కాన్సెప్ట్ శిబిరాన్నిజడ్పీటీసీ సభ్యులు గుంట మడుగు, రవీంద్రరాజుప్రారంభించారు. అనంతరంవారు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీకాన్సెప్ట్‌కార్యక్రమంజరుగుతుందనిపేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు వైద్యానికి మొదటి స్థానం



అందిస్తున్నారని చరిత్రలో ఏ నాయకుడు చేయని విధంగా ముఖ్య మంత్రి జగనన్న చేస్తున్నారని కొనియాడారు. ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ ద్వారా మెడికల్ క్యాంప్ విజయవంతం అయ్యేందుకు పేద ప్రజలకు, సాధారణ, దీర్ఘకాలిక రోగులకు, గర్భవతులకు బాలింతలను క్యాంప్‌కు తీసుకొచ్చి అన్ని రకాల రక్త పరీక్షలు, వైద్యులు చెకప్‌లు, మంచి క్వాలిటీ కలిగిన మందులు అంద`జేసి ఈ మెడికల్ క్యాంప్ విజయవంతం చేయాలని కోరారు. అనం తరం వైద్యులు సీజనల్, కీటకజనితవ్యాధులపై అవగాహన కల్పించారు. వ్యాధిగ్ర స్తులను ఆహ్వానించడంతోపాటు పలు వ్యాధులకు సంబంధించిన కరపత్రాలను అందిం చారు. మంచానికి పరిమితమైన పలువురు రోగులను డాక్టర్లు, వైద్య సిబ్బంది వారి ఇంటి వద్దకు వెళ్లి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు గుంట మడుగు రవీంద్రరాజు, సర్పంచ్‌టి.పోలయ్య, ఎంపీటీసీజి.రఘురామరాజు, వైద్యులు మాధవ, హరిసుహాస్‌రెడ్డి, జి.శివ వినీషా, సీహెచ్‌వో చలపతి, హెల్త్‌అసిస్టెంట్ కన్నావెంకట రమణయ్య,ఏఎన్ఎం ప్రమీల, హెల్త్‌ఎడ్యుకేటర్‌సుధాకర్‌రావు,104వైద్య సిబ్బంది ఎస్.కె.మెహతాబ్, చంద్రబాబు, ఆశ, వలంటీర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే సంజీవయ్య
నాయుడుపేట, అక్టోబర్ 27 ప్రభాతవార్త



శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం నేలటూరులో ఏపీ జెన్‌కో ప్రాజెక్టు మూడో యూనిట్‌ను జాతికి అంకితం చేయడానికి వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నాయుడుపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక స్వాగతం పలికారు. ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

## లక్ష్మీ నరసింహస్వామి ఆలయ చైర్మన్‌గా ఆనంద్
చిల్లకూరు అక్టోబర్ 27 ప్రభాతవార్త



మండలంలోని కలవకొండ గ్రామంలో కొండపైన వెలసి యున్నశ్రీలక్ష్మీనరసింహస్వామిఆలయచైర్మన్‌గా గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ నేతృత్వంలో కందల ఆనంద్ ప్రమాణస్వీకారం చేశారు. అదే విధంగా కమిటి సభ్యులైన దొంత వెంకటేశ్వర్లు, ఉడతా సుబ్రమ ణ్యం, నారుబోయిన రామచంద్రయ్య, బూదురు కోటమ్మ, ఆణిశెట్టి సుగుణమ్మ,బూదురు అచ్చమ్మలతో పాటు విజయ్ గోపాల్ ఎక్స్ అఫిషియా మెంబర్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎమ్మెల్యే వరప్రసాద్ మాట్లాడుతు ఎంతో పురాతనమైన ఈ ఆలయాన్ని అంచలంచలుగా అభివృద్ధి చేసేందుకు తోడ్పడని యరటపల్లి జానకిరామిరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ ఆలయంతోపాటు తూర్పు కనుపూరు గ్రామంలో వెలసియున్న ముత్యాలమ్మ తల్లి ఆలయంలో, తమ్మినపట్టణం గ్రామంలో ఉన్న కోదండరామిస్వామి ఆలయాలు కూడా కనివిని ఎరుగని రీతిలో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ ఓడూరు యమునమ్మ, జడ్‌పిటిసి మన్నెం శ్రీనయ్య,ఎఎంసి మాజీ చైర్మన్‌లునల్లారెడ్డిరమేష్‌బాబురెడ్డి, యరటపల్లి జానకిరామిరెడ్డి, ఆలయ ఇఒలు కె నవీన్‌కుమార్, కోవూరు జనార్ధన్‌రెడ్డి, సర్పంచ్ ఉడతా సుభాషిణి,ఎంపిటిసి జానకిరామ్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## కోటలో మండల స్థాయి క్రీడా పోటీలు
కోట,అక్టోబర్ 27 ప్రభాతవార్త



క్రీడలు మానసిక ఉల్లసాన్ని కలిగిస్తాయని ఎంపిడివో మారెళ్ల భవాని చెప్పారు. గురువారం స్థానిక ఎవికేఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్దాయి క్రీడ పోటీలను ఎంపిపి, దాసరి అంజమ్మ, ఎంపిడివో మారెళ్ల భవాని ప్రారంభించారు. ఈసందర్భంగా బవాని మాట్లాడుతూ గ్రామీణి క్రీడా కారులకు ప్రభుత్వం ఏన్నో సదుపాయాలు కల్గిస్తుందన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ నియామకాల్లో రిజ్వరేషన్లు ఉంటాయని చెప్పారు. అనంతరం ఎంఇఒ ఎం.వెంకటసునిల్ కుమార్ మాట్లాడుతూ మండల స్దాయిలో ఎంపికైన క్రీడాకారులు, డివిజన్ స్దాయి, ఆపై జిల్లా స్థాయిలో ఉంటాయన్నారు. క్రీడలు వల్లన విద్యార్థులకు జ్ఞాపకశక్తి పెరుగుతందన్నారు. ఉ్తమ క్రీడాకారులుగా నిలవాలన్నారు. ఒటమి,విజయం అనే తేడా లేకుండా క్రీడాల్లో పాల్గొనటమే విజయంగా భావించాలన్నారు. ఈకార్యక్రమంలో జిడ్పిటిసి సభ్యులు, దాసరి కోటయ్య, సర్పంచ్ వెంకటరమణమ్మ, వైకాపా నాయకులు చేవూరి నాగేశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు.

## చిట్టేడు ఆర్‌బీకేలో ఆర్డీఓ తనిఖీలు
కోట, అక్టోబర్ 27 ప్రభాతవార్త

కోట మండలం చిట్టేడు రైతు భరోసా కేంద్రాన్ని గురువారం గూడూరు ఆర్డీఒ మురళీకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు సంబంధించిన ఈ-పంట నమోదు ఎలా చేశారు, రైతులు వేసిన పంట, రికార్డుల పరంగా ఉన్న పంటపై పరిశీలించారు. అనంతరం రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై వివరించారు. రైతులందరు ఆర్‌బీకేలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట మండల విస్తరణ అధికారిణి ప్రశాంతి, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు ఉన్నారు.

## నెల్లూరు బ్యారేజికి శ్రీనివాసులురెడ్డి పేరు పెట్టడం పట్ల హర్షం
కోట, అక్టోబర్ 27 ప్రభాతవార్త



నెల్లూరు బ్యారేజికి దివంగత మాజీ మంత్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేరును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడం పట్ల రాష్ట్ర వైసీపీ ఎస్సీ సెల్ జాయింట్ సెక్రటరీ వల్లం సురేంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఆయన గురువారం కోటలో విలేఖరులతో మాట్లాడుతూ ప్రజానేత నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలుగుగంగ కాలువను తీసుకొచ్చి రైతుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని, ఆ మహనీయుడి పేరు నెల్లూరు బ్యారేజికి పెట్టడం ఒక్క నల్లపరెడ్డి వర్గం అని కాకుండా రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్గాల్లో ఆనందం వ్యక్తమవుతోందన్నారు. నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి తుదిశ్వాస వరకు ప్రజల కోసం పనిచేశారని చెప్పారు. ఆయన వారసుడు, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కూడా తండ్రికి తగ్గ తనయుడిగా కోవూరు నియోజకవర్గంలో బలమైన ప్రజానేతగా గుర్తింపు పొందారని చెప్పారు.

## క్రీడలలో ఉన్నత స్థానాన్ని సాధించాలిఃఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి
సదుం,అక్టోబరు 27 ప్రభాతవార్త



విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల నుంచి క్రీడలలో ఉన్నత స్థానాన్ని సాధించాలని తంబళ్లపల్లె శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. గురువారం సదుం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నియోజక వర్గ స్థాయి వాలీబాల్, కబడ్డీ, త్రోబాల పోటీలను జట్ల ఎంపికను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది క్రీడాకారులు రాణించి మంచి మంచి స్థానాలలో ఉన్నారని చెప్పారు. క్రీడలలో పాల్గొనడం వల్ల మానసిక ఉల్లాసం తోపాటు దేహదారుఢ్యం పెరుగుతుందని చెప్పారు. విద్యార్థులు ఎటువంటి బేషిజం లేకుండా క్రీడలలో పాల్గొని పాఠశాలకు, వారి ఊరికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. అనంతరం క్రీడల పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సోమశేఖరరెడ్డి, ఎంఈఓ శ్రీరాములు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫజురుల్లా, మాజీ పిఈటీలు మల్‌రెడ్డి, రామచంద్రయ్య, వెంకటేష్,రవి తదితరులు పాల్గొన్నారు.

## మద్యం పక్కదారి పట్టిస్తే చర్యలు
కల్లూరు, అక్టోబరు 27 ప్రభాతవార్త



ప్రభుత్వ మద్యం దుకాణంలో పనిచేస్తున్న సిబ్బంది మద్యం సీసీలను పక్కదారి పట్టిస్తే వేటు తప్పదని చిత్తూరు మద్యం డిపో ఎస్ఐ రామకృష్ణశాస్త్రి సిబ్బందిని హెచ్చరించారు. గురువారం ఆయన పాకాల ఎక్సైజ్ స్టేషన్ పరిదిలోని పులిచెర్ల మండలంలోగల వివిధ మద్యం దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీ రేట్లకే మద్యం విక్రయించాలని అతిక్రమించరాదని ఆదేశించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. తనిఖీలలో హెడ్ కానిస్టేబుల్ రమణ, కానిస్టేబుళ్ల రాజశేఖరరెడ్డి, లోకనాథం,కవితలు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారికి గాయాలు -నలుగురికి మెమోలు జారీ

తొట్టంబేడు, అక్టోబర్ 27 ప్రభాతవార్త



మండలంలోని పెద్దకనపర్తి అంగన్‌వాడీ కేంద్రంలో ఓచిన్నారి ప్రమాదవశాత్తు అగ్గిపుల్లకాల్చి మరో చిన్నారిపై వేయగా చిన్నారి కాలికి తీవ్రగాయమైంది. వివరాలిలా ఉన్నాయి. పెద్దకనపర్తి గ్రామంలోనే రెండు కేంద్రాలు ఒకచోట నడుపుతున్నారు. సుమారు 15మంది విద్యార్థులు వస్తుంటారు. అంగన్‌వాడీ టీచర్లు దేవిలత, నాగమణిలతో పాటు హెల్పర్లు వరాలు, ముత్యాలమ్మలు ఉన్నారు. రెండు రోజుల క్రితం అంగన్‌వాడీ కేంద్రంలో ఓచిన్నారి దీపావళి టపాకాయల్లోఉన్న అగ్గిపెట్టెలోని ఒపుల్లను తీసికాల్చడంతో భయపడ్డ చిన్నారి పక్కనే ఉన్న మరో చిన్నారిపై వేయడంతో ఆచిన్నారి కుడికాలుకు తీవ్రగాయాలయ్యాయి. అయితే సంఘటన జరిగిన సమయంలో అంగన్‌వాడీ టీచర్ కోడిగుడ్లు తీసుకురావ డానికి వెళ్ళిందని చెబుతున్నా రు. మరో అంగన్‌వాడీ టీచర్ కూడా ఉన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో గ్యాస్ అయిపోయిందని హెల్పర్లు విద్యార్థులకు వంటచేసుకువచ్చేందుకు ఇంటికి వెళ్ళడంతో అంగన్ వాడీ కేంద్రంలో ఈసంఘటన చోటుచేసుకుంది. దీంతో వెంటనే స్పందించిన వారు చిన్నారి తల్లిదండ్రులకు తెలిపి ఆస్పత్రికి తరలిం చారు. దీనిపై స్పందించిన ఐసిడిఎస్ సిడిపిఒ అంగన్‌వాడీ టీచర్లు దేవిలత, నాగమణి, హెల్పర్లు వరాలు, ముత్యాలుకు సంజాయిషీనోటీసులు జారీచేసినట్లు వివరించారు.

## అలిపిరి డిపో డ్రైవింగ్ స్కూల్‌లో నూతన బ్యాచ్ ప్రారంభం

-స్వాగతం పలికిన డిపిటిఓ చెంగల్‌రెడ్డి



తిరుపతి ప్రెస్‌క్లబ్, అక్టోబర్ 27 ప్రభాతవార్త:

ఎపిఎస్‌ఆర్టీసీ అలిపిరి డిపోలో నిర్వహిస్తున్న హెవీ మోటార్ డ్రైవింగ్ స్కూల్‌లో 15వ బ్యాచ్ విద్యార్థులు దిగ్విజయంగా తమ శిక్షణ పూర్తిసుకున్నారు. వీరికి వీడ్కోలు పలుకుతూ కొత్తగా ప్రవేశించిన 15వ బ్యాచ్ విద్యార్థులకు జిల్లా ప్రజా రవాణా అధికారి(డిపిటిఓ) తిమ్మాడి చెంగల్‌రెడ్డి స్వాగతం పలికారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డిపిటిఓ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ డ్రైవర్లకు మన దేశంలోనే కాక ఇతర దేశాలలో సైతం డిమాండ్ బాగా ఉంది కాబట్టి, ప్రతి ఒక్కరు చాలా జాగ్రత్తగా డ్రైవింగ్ నేర్చుకోవాలన్నారు. అనంతరం డిపో మేనేజర్ హరిబాబు మాట్లాడుతూ ఇప్పటి వరకు 15 బ్యాచ్‌లుతమడ్రైవింగ్‌శిక్షణనువిజయవంతంగాపూర్తి చేసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. నవంబర్ 1నుండి17వ బ్యాచ్‌కు దరఖాస్తులను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు స్కూల్ కో-ఆర్డినేటర్ రాము(సెల్ నెం:7382882441)ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో చివరిగా శిక్షణ పూర్తి చేసుకున్న15వబ్యాచ్‌విద్యార్థులకుడిపిటిఓచెంగల్‌రెడ్డితన చేతులమీదుగా వారికి సర్టిఫికెట్లను అందచేశారు.

## శ్వేతలో టిటిడి కళాశాలల అధ్యాపకులకు శిక్షణ

తిరుపతి (విద్య), అక్టోబర్ 27, ప్రభాతవార్త



తిరుపతి శ్వేతలో టిటిడి జూనియర్, డిగ్రీ కళాశాలల అధ్యాప కులకు ఉత్తమ ఉపాధ్యాయుడు ఎలా ఉండాలి అనే అంశంపై గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్ర మాన్ని ప్రారంభించిన డిఈవో భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఆదర్శవంతులుగా ఉండి విద్యార్థులను ప్రతిభావంతులుగామార్చడానికిఈశిక్షణఎంతగానో ఉపయోగప డుతుందని చెప్పారు. ఈ శిక్షణలో జాతీయ స్థాయి శిక్షకులు నాగరాజు శిక్షణ ఇవ్వడం ఆనందదాయకమన్నారు. శ్వేత సంచాలకులు ప్రశాంతి పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి క్రీడల్లోనూ రాణించాలి

హెడ్ మిస్సెస్ షకీనమ్మ

తిరుపతి (క్రీడ), అక్టోబర్ 27, ప్రభాతవార్త



ప్రతి విద్యార్థి విద్యతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమని క్యాంపస్ స్కూల్ హెడ్ మిస్సెస్ షకీనమ్మ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వహించిన అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో నిర్వహించిన పోటీలలో క్యాంపస్ స్కూల్ విద్యార్థులు షరీఫ్ వర్ష పూజిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెడ్ మిస్ట్రెస్ షకీనమ్మ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో నైపుణ్యం సాధించాలని సూచించారు. క్రీడలతో శారీరక దృఢత్వం మానసిక ప్రశాంతత ఏకాగ్రత శ్రద్ధ పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రధాన ఉపాధ్యాయులు వెంకటేశ్వర రాజు, వ్యాయామ ఉపాధ్యాయులు సన్నీ, ప్రభాకర్, శరవణ పాల్గొన్నారు.

## 2405 లీటర్లు మద్యం ధ్వంసం

సత్యవేడు, అక్టోబర్ 27 ప్రభాతవార్త :



పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డ 2405లీటర్లు మద్యంను పోలీసులు ధ్వంసం చేసినట్లు సీఐ శివకుమార్ రెడ్డి తెలిపారు. సీఐ మాట్లాడుతూ 2020వ సంవత్సరం నుంచి ఇప్పటి వరకు పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డ మద్యంను జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి ఆదేశాలతో ఏఎస్పీ సుప్రజ ఆధ్వర్యంలో రోడ్‌రోలర్ సహాయంతో ధ్వంసం చేయడం జరిగిందన్నారు. ఈ అక్రమ మద్యం రవాణాలో పట్టుబడిన మద్యం బాటిల్స్ 13066కాగా దీని విలువ సుమారు రూ.19లక్షలు ఉంటుందన్నారు. ఇప్పటికే తడ స్టేషన్‌లో 18, సత్యవేడు స్టేషన్‌లో 137కేసులు నమోదైన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తమిళనాడు సరిహద్దును పంచుకుంటుండడంతోనే ఈ అక్రమ మద్యం రవాణా ఎక్కువగా ఉందన్నారు. అక్రమ మద్యం రవాణా చేస్తూ పట్టుబడితే పీడీయాక్టు కేసులు కూడా నమోదు చేయబడుతుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సెబ్ డిఎస్పీ శ్రీనివాసులు, సత్యవేడు ఎస్ఐ పురుషోత్తం, వీరాంజనేయులు, శ్రీనివాసులు రెడ్డి, పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వేనాటి సతీష్‌రెడ్డిని కలిసిన తెలుగుదేశం పార్టీ నాయకులు

ఓజిలి, అక్టోబరు 27 ప్రభాతవార్త:

తిరుపతి పార్లమెంట్ తెలుగుదేశం జిల్లా ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డిని ఓజిలి మండలం తెలుగుదేశం పార్టీ యువ నాయకులు అలిమిలి మల్లికార్జున్‌రెడ్డి, కార్తీక్‌రాజు, కిషోర్‌కుమార్‌రాజు, సీనియర్ నాయకులు అల్లాభక్షు మర్యాదపూర్వకంగా కలసి శాలువలతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఓజిలి మండలం పార్టీ పరిస్థితి ఆయన తెలుసుకున్నారు. సభ్యత్వం, బలోపేతానికి మీ వంతు కృషి చేయాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో 2024కి, ఓజిలి మండలంలోపార్టీ జెండా ఎగరాలని దానికి బాధ్యత యువకులు తీసుకోవాలన్నారు.

## ఆకట్టుకుంటున్న నృత్య ప్రదర్శన

.శ్రీకాళహస్తి, అక్టోబర్ 27 ప్రభాతవార్త



కార్తీక మాసం సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరా లయంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శ్రీకాళహస్తికి చెందిన అక్షయ చరిత, హర్షిత సూర్యకుమార్‌లు తమ నృత్య ప్రదర్శనలతో భక్తులను అలరించారు. చిన్నారు లు అన్నమయ్యకీర్తనలు, శివతత్వ పాటలకు చక్కగానృత్యప్రదర్శనచేశారు. ఈసందర్భంగావీరికి ఆలయాధికారులు స్వామి అమ్మ వార్లతీర్థప్రసాదాలనుఅందించిసత్కరించారు.

## నిబంధనల మేరకు పాఠశాల బస్సులు నడపాలి..ఎంవిఐ

శ్రీకాళహస్తి, అక్టోబర్ 27 ప్రభాతవార్త



నిబంధనల మేరకు పాఠశాల బస్సులు ఉండాలని లేకుంటే వాటిని సీజ్ చేయడం జరుగుతుందని ఎంవిఐ దామోదరనాయుడు తెలిపారు. గురువారం మోటారు వాహనాల తనిఖీ అధికారి కార్యాలయంలో శ్రీకాళహస్తిలోని పాఠశాలలుమరియుకళాశాలలయాజమాన్యాలతో సమావేశా న్ని ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు మరియు రవాణాశాఖ కమిషనర్ వారి ఆదేశానుసారం ప్రతి స్కూలు బస్సును నిబంధనల మేరకు నడపాలని ప్రతి బస్సుకు ఖచ్చితంగా లాక్‌చేయబడే డోర్ ఉండాలని, అనుభవం ఉన్న అటెండర్, బస్సుతో పాటు ఉండి విద్యార్థులను క్షేమంగా తీసుకెళ్లడానికి సహకరించాలని తెలిపారు. స్కూలు, కళాశాలల బస్సులు నడిపే డ్రైవర్లు అందరు ఖచ్చితంగా లైసెన్సులు ఉండాలని వాహనం నడపడంతో సూమారు 5సంవత్సరాలు అనుభవం ఉండి 60సంవత్సరాలకు మించి ఉండరాదన్నారు. విద్యార్థులు బస్సుల నుంచి చేతులు బయటకు పెట్టకుండా బస్సుకు ఇరువైపులా మూడు జాలీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పాఠశాల యాజమాన్యాలువారిబస్సుల్లో వచ్చే విద్యార్థులనే కాకుండా పాఠశాలకు వచ్చే ఆటోలను కూడా గమనించి విద్యార్థులు ప్రమాదకరంగా ప్రయాణిస్తూ ఉంటే వారి తల్లిదండ్రులకు తెలియజేయాలని కోరారు. సమావేశంలోఅన్నిపాఠశాలలు, కళాశాలలకరస్పాండెంట్లు, మరియు వాహనాల ఇన్‌ఛార్జిలు హాజరయ్యారు.

## ముఖ్యమంత్రిని కలిసిన ప్రముఖులు

తిరుపతి అక్టోబర్ 27 ప్రభాతవార్త:







నెల్లూరు జిల్లా పర్యటన నిమిత్తం రేణిగుంట విమానాశ్రయానికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్‌రెడ్డిని టిటిడి బోర్డు సభ్యులు పోకల అశోక్‌కుమార్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యం.ఆర్.సి.రెడ్డి, యువనాయకులు, వైకాపా సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు చొక్కారెడ్డి జగదీశ్వరరెడ్డి కలిసి ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి, దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు.

## తహసీల్దార్‌కు ఘన సన్మానం

రేణిగుంట, అక్టోబరు 27 ప్రభాతవార్త:



రేణిగుంట తహసీల్దార్ శివప్రసాద్‌ను రేణిగుంట మేజర్ పంచాయతీ సర్పం చ్ నాగేషం, ఆషారాజు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఆంధ్రప్రదేశ్ రెవెన్యూఅసోసియేషన్ సర్వీసెస్ జిల్లా అధ్యక్షునిగా ఏకగ్రీవంగా తహసీల్దార్ ఎంపికైన సందర్భంగా సన్మానం చేశారు. ఆయనకు పూలమాలలు వేసి శాలువ కప్పి సత్కరించడంతో పాటు అంబేద్కర్ చిత్రపటాన్ని బహుకరించారు.

## నాన్న పేదల పక్షపాతి - బియ్యపు ఆకర్షరెడ్డి

రేణిగుంట, అక్టోబరు 27 ప్రభాతవార్త:

తనతండ్రిఎమ్మెల్యేబియ్యపు మధు సూదన్‌రెడ్డి పేద ప్రజల పక్షపాతి అనఇ బియ్యపు ఆకర్షరెడ్డి అన్నా



రు. రేణిగుంట మండలం డీపీ కండ్రిగ గ్రామంలో మృతిచెందిన చెంగయ్య కుటుంబానికి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఇచ్చిన పదివేల నగదును గురువారం ఆయన కుమారుడు ఆకర్షరెడ్డి అందజే శారు. ఈ సందర్భంగా ఆకర్షరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఎప్పుడు పేదల అభివృద్ధి కోసం పాటు పడుతున్నారన్నారు. నాన్న అందుబాటులో లేకపోయినా తన తరపున సహాయాన్ని కుటుంబ సభ్యులైన తమ ద్వారా అందజేస్తున్నారని తెలిపారు.

## దళిత ఆత్మీయ సదస్సుకు ఎమ్మెల్యే,మేయర్లకు ఆహ్వానం

తిరుపతి ప్రెస్‌క్లబ్, అక్టోబర్ 27 ప్రభాతవార్త:



తిరుపతి నగరంలో త్వరలో జరగబోవు దళిత ఆత్మీయ సదస్సుకు తప్పక హాజరు కావాలని నగరానికి చెందినదళితనాయకులుస్థానికఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, నగరపాలక సంస్థ మేయర్ డా॥శిరీషలను ఆహ్వానించారు. గురువారం ఎమ్మెల్యేని ఆయన నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మేయర్లు దళిత ఆత్మీయ సదస్సుకు తప్పక హాజరవుతామని హామీ ఇచ్చారు. క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ డా॥యలమంచిలి ప్రవీణ్, ఎంవిఎస్. మణి, మల్లారపు మధు, పిసి.స్వామి, రాజేష్, చెంగయ్య, రవికుమార్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి..ఎస్ఐ

తొట్టంబేడు, అక్టోబర్ 27 ప్రభాతవార్త

చట్టాలపై విద్యార్థులందరు అవగాహన కలిగి ఉండాలని తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు. పోలీసులు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా తొట్టంబేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి అవగాహన కల్పించారు. పోలీసులు వాడే పరికరాలు, వైర్‌లెస్‌సెట్లు, ఎలా సమాచారం వస్తుంది అన్న వాటిపై ఎస్ఐ విద్యార్థులకు వివరించారు. 100కు ఫోన్‌చేస్తే వెంటనే ఎలాంటి ప్రమాదం నుంచైనా బయటపడొచ్చని తెలిపారు. అనంతరం పోలీసులు వాడే ఆయుధాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు. కాగా మండలంలోని తాటపర్తి పంచాయతీ కల్లిపూడి గ్రామంలో ఎస్ఐ ఆధ్వర్యంలో ప్రజలు, యువతకు సైబర్‌క్రైం, వివిధ రకాలైన యాప్స్‌పై అవగాహన కల్పించారు.

## కపిలేశ్వర ఆలయంలో ముగిసిన గణపతి హోమం

తిరుపతి, అక్టోబర్ 27ప్రభాతవార్త:



కార్తీకమాసం సందర్భంగా కపిలేశ్వరస్వామి ఆలయంలో మొదలైన విశేష హోమపూజమహోత్సవాల్లోగురువారంగణపతిహోమంజరిపించి ముగిం చారు. ఆలయంలో కార్తీకమాసంలో నెలరోజులు హోమమ హోత్సవాలు నిర్వహిస్తారు. ఉదయంపంచమూర్తులకు పాలు, పెరుగు, తేనె, చందనం, విభూదితో విశేషంగా స్నపనతిరుమంజనం నిర్వహించారు. 28నుంచి 30వ తేదీ వరకు సుబ్రమణ్యస్వామి హోమం మూడురోజులు ఘనంగా జరిపిస్తారు. గృహస్థభక్తులు 500 రూపాయలు చెల్లించి హోమాల్లో పాల్గొనవచ్చు. ఈ హోమంలో ఆలయ డిప్యూటీ ఇఓ దేవేంద్రబాబు, ఎఇఓ శ్రీనివాసులు, సూపరింటెండెంట్లు భూపతి, శ్రీనివాసులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, అర్చకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఓటరు నమోదు వేగవంతం

తిరుపతి, అక్టోబర్ 27 ప్రభాతవార్త:



త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకునే కార్యక్రమం వేగవంతం చేసినట్లు బిజెపి నేతలు గుండాల గోపీనాథరెడ్డి, సుబ్రమణ్యంయాదవ్, అక్కిపల్లిమునికృష్ణయ్య యాదవ్, విజయకుమార్‌రెడ్డి, మల్లారపు రవి, కవిత, బాబు తదితరులు గురువారం పెద్దకాపులేఔట్‌లో ఇంటింటికెళ్ళిఓటర్లనమోదుఫారం అందించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కుకు గ్రాడ్యుయేట్లందరూ ఓటరుగా నమోదు కావాలని కోరారు.

# తిరుపతి డివిజన్

## రైతుల సమగ్రాభివృద్ధిలో ఆర్‌బికె సమృద్ధిగా సేవలు



విజిలెన్స్ ఆఫీసర్ ఈశ్వర్‌రెడ్డి

చంద్రగిరి, అక్టోబర్ 27 ప్రభాతవార్త:

రైతుల సమగ్రాభివృద్ధిలో రైతుభరోసా (ఆర్‌బికె) కేంద్రా లు సమృద్ధిగా సేవలందించాల్సివుందని విజిలెన్స్ ఆఫీ సర్ ఈశ్వర్ రెడ్డి అన్నారు. ఏపి విజిలెన్స్అండ్ ఎన్‌ఫో ర్స్‌మెంట్ డిజి శంఖబ్రత భాగ్చి ఆదేశాల మేరకు.. మండల పరిధిలోని దోర్నకంబాల ఆర్‌బికెని గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం, అభివృద్ధికై రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలను సమర్థవంతంగా చేరవేయాలన్నారు. ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు పంపిణీపై ఆరాతీశారు. అదేవిధంగా ఈ క్రాప్ నమోదు, పొలంబడి, తోటడి, పశు విజ్ఞానం వంటి పథకాలకు సంబంధించిన రికార్డుల నిర్వహణను పరిశీలించారు.

## నగదు పరిహారం వద్దు.. భూమికి బదులు భూమి



తహశీల్దార్ శిరీషాకు ఎ.రంగంపేట రైతుల వినతి

చంద్రగిరి, అక్టోబర్ 27 ప్రభాతవార్త:

జాతీయ రహదారుల నిర్మాణంలో భూములు కోల్పోతున్న తమకు ప్రభుత్వం అందించే నగదు పరిహారం వద్దని ఆరేపల్లి రంగంపేట రైతులు తహశీల్దార్ శిరీషాకు విన్నవించారు. మండల పరిధిలోని ఏ.రంగం పేటలో గురువారం తిరుపతి-మదనపల్లి జాతీయ రహదారి విస్తరణపై తహశీల్దార్ రైతులతో నేరుగా ముఖాముఖీ మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రాష్ట్ర విభజన, జిల్లాల పునర్విభజనతో భూముల విలువ అమాంతం పెరిగిందన్నారు. ఈ నేపధ్యంలో తమకు ప్రభుత్వం అందించే పరిహారంతో మరో ప్రదేశంలో భూములు కొనుగోలు చేయలేమన్నారు. తమకు ఆర్థికంగా పరిహారం వద్దనీ భూమికి బదులు ప్రభుత్వ భూమిని పంపిణీ చేయాలని కోరారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించి తగిన పరిష్కారం చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ పురుషోత్తం రెడ్డి, ఆర్ఐ మోహన్ రెడ్డి, విఆర్ఓ గిరి, రైతులు ఎన్ఎచ్ సిబ్బంది దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

## శివయ్యసేవలో కర్నూల్ ఎంపి

శ్రీకాళహస్తి, అక్టోబర్ 27 ప్రభాతవార్త



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని గురువారం కర్నూల్ ఎంపి డాక్టర్ సంజీవ్ కుమార్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారకశ్రీనివాసులు సారధ్యంలో దక్షిణగోపురంవద్దస్వాగతం పలికారు. ఆలయంలోస్వామి అమ్మవార్లను దర్శించుకున్న వారికి గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వ చనాలు అందించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఎసి మల్లికార్జున్ ప్రసాద్, ప్రత్యేకాహ్వానితులు జూలుగంటి సుబ్బారావు, వైకాపానాయకులురవి, లక్ష్మీపతి, రమణయ్యనాయుడు, గోపి గౌడ్, బాలాగౌడ్‌లు పాల్గొన్నారు.

## నవంబర్ 5న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష

-ఆర్డీవో రామారావు



శ్రీకాళహస్తి, అక్టోబర్ 27 ప్రభాతవార్త

పట్టణంలోని స్వామి విద్యాప్రకాశనంద ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో గ్రూప్-1 ప్రిలిమినరీ నమూనా పరీక్షను నిర్వహించనున్నట్లు ఆర్డీవో కెవిఎస్.రామారావు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష ఉదయం 9 గంటల నుంచి నిర్వహించబడుతుందని అధిక మార్కులు సాధించిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. పరీక్ష అనంతరం నిష్ణాతులచే సూచనలు, సలహాలు ఇవ్వబడుతుందని గ్రూప్-1,2 మరియు ఇతర పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు ఎస్వీఏ బాలుర కళాశాలలో ఆంగ్ల అధ్యాపకులు డాక్టర్ జి.రమేష్, 9848898024 నంబర్‌కు ఫోన్‌చేసి తెలుసుకోవచ్చన్నారు.

## ఆక్రమణలపై తహశీల్దార్ కన్నెర్ర

-కోట్లు విలువైన భూమి స్వాధీనం

తొట్టంబేడు, అక్టోబర్ 27 ప్రభాతవార్త



తొట్టంబేడు తహశీల్దార్ కార్యాలయాన్ని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్ సుధీర్‌రెడ్డి గాడిలో పెడుతున్నారు. ఓవైపు రైతుల సమస్యలు, మరోవైపు ఆక్రమణలపై దృష్టిసారించి ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు. ఈనేపధ్యంలో గురువారం కోట్లు విలువచేసే భూమిలో కొందరు కబ్జాదారులు, రియల్‌వ్యాపారులతో కుమ్మక్కై వెంచర్లు వేయడంతో స్పందించిన ఆయన వాటిని తొలగింపు చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. దీనిపై కన్నుపడ్డ కబ్జారాయుళ్ళు ఒక్కొక్క ప్లాటు ధరను లక్షల్లో అమ్మాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. మండలకేంద్రానికి సమీపంలో చెన్నై-నాయుడుపేట బైపాస్‌రోడ్డు సమీపంలో కల్లాంమిట్ట సర్వే నంబర్ 10/1లో 0.23సెంట్లు ప్రభుత్వ భూమి ఉంది. దీనిలో కొందరు వెంచర్లు వేయడంతో విషయం తెలుసుకున్న తహశీల్దార్ వెంటనే విఆర్ఓ చిట్టిబాబుతో కలసి ఆక్రమణల్లో ఉన్న భూముల్లో వేసిన సర్వేరాళ్ళను తొలగించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ చెన్నై-నాయుడుపేట లింకురోడ్డుకు పక్కనే ఆనుకుని ఉన్న కోట్లు విలువైన భూమిలో కొందరు కబ్జాదారులు ఆక్రమించారని విషయం తెలుసుకున్నానని వెంటనే వీటిలో వేసిన రాళ్ళను తొలగించినట్లు తెలిపారు. ప్రభుత్వ భూముల్లో ఎవ్వరైనా ఆక్రమణలు చేపడితే సహించేది లేదని వారిపై క్రిమినల్ కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. విఆర్ఓలు తమ పరిధిలోని రెవెన్యూలో ఎప్పుటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని లేకపోతే వారిపై కూడా చర్యలు తప్పవని హెచ్చరించారు.

## జీరో ఎఫ్ఐఆర్ అవకాశాన్ని విస్మరించడం బాధ్యతారాహిత్యం

శ్రీకాళహస్తి, అక్టోబర్ 27 ప్రభాతవార్త



ఏదైనా నేరం జరిగినపుడు పోలీస్‌స్టేషన్ పరిధిలో సంబంధం లేకుండా ఏస్టేషన్‌లో అయినా ఫిర్యాదు చేసే వెసులుబాటు కల్పించే జీరో ఎఫ్ఐఆర్ విధానాన్ని పోలీసు అధికారులు ఉపయోగించుకోకపోవడం అత్యంత బాధ్యత రాహిత్యం అని తెలుగునాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి మరియు బిసి వెల్ఫేర్ జెఏసి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో నివాసం ఉండే ఠాగూర్ మరియులలితమ్మల కుమార్తె అయిన చంద్రిత అనే మైనర్ బాలిక మృతదేహం అనుమానాస్పద స్థితిలో పక్కన ఉన్న కెవిబిపురం మండలం కోవనూరు గంగ కాలువలో కనిపించిందని, తమ కుమార్తె మృతికి కారకులుగా కొందరిని అనుమానిస్తూ ఠాగూర్, లలితమ్మ దంపతులు పోలీసులకు పిర్యాదు చేయడానికి చేస్తున్న ప్రయత్నాలను పరిధి కారణంగా చూపి పోలీసు అధికారుల పిర్యాదు స్వీకరించడానికి నిరాకరించడం తీవ్రమైన చట్టవ్యతిరేకమైనదని తెలిపారు. పోలీసు ఉన్నతాధికారులు తక్షణమేస్పందించిచంద్రితమృతికికారణాలనువెలికితీసినిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు.

## మానవుని దానాల్లో రక్తదానం చాలా గొప్పది

నగరి రూరల్ సిఐ రాజశేఖర్

నింద్ర, అక్టోబరు 27 ప్రభాతవార్త :

మానవుడు చేసే దానాలలో రక్తదానం చాలా గొప్పదని నగరి రూరల్ సిఐ రాజశేఖర్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని సిఐ కాంపౌండ్‌లో అంబేద్కర్, పోలీసుల అమరవీరుల స్మసరణ దినోత్సవం పురస్కరించుకొని 60 మంది రక్తదానం చేసారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగిన వ్యక్తులకు రక్త హీనత కలిగినవారికి రక్తం దొరకకుండా ఇబ్బందిపడే వారికి ప్రజలు స్వచ్ఛందంగా ఉచితంగా అందజేసిన రక్తం వారికి ఉపయోగపడుతుందని అన్నారు. ధనవంతులు డబ్బులు ఇచ్చి రక్తాన్ని కొనుగోలు చేసుకుంటారని కానీ పేదలు డబ్బులు ఇచ్చి రక్తాన్ని కొనుగోలు చేయలేని పరిస్థితిలో వున్న వారికి ఉచితంగా రక్తం అందుబాటులో వుంచడం వలన భవిషత్‌లో రక్తం ఉపయోగపడుతుందని తెలిపారు. నగరి రూరల్ పరిధిలో వున్న పోలీసులు, సచివాలయ సిబ్బంది, మండలంలోని ప్రజలు స్వచ్ఛందం రక్తదానం అందజేయడానికి ముందుకు వచ్చిన వారందరికి ధన్యవాదాలు తెలియజేసారు. ఈకార్యక్రమంలో తహశీల్దారు అమరేంద్రబాబు, యంపిడిఓ వేణు, వైద్యాధికారి కళ్యాణి, నింద్ర యస్ఐ వెంకటసుబ్బమ్మ, విజయపురం యస్ఐ నరేష్, ఎయస్ఐ ఏలుమలైరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాస్ ఉచిత పశువైద్య శిబిరం

రేణిగుంట, అక్టోబరు 27 ప్రభాతవార్త:



రాష్ట్రీయ సేవా సమితి, పొదుపు సంఘాల ప్రాజెక్టు డైరెక్టర్ వి.నాగరాజు సూచనల మేరకు రేణిగుంట మండలం కరకంబాడి రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్టు ఆధ్వర్యంలో గుండ్రాళ్ళ కాలువ తదితర గ్రామాల్లో గురువారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. డాక్టర్ బి.స్రవంతి మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా రాస్ సంస్థ గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నో రకాల సంక్షేమ కార్యక్రమాలు ఉచితంగా అందించడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. శిబిరంలో ఆవులు, దూడలు, మేకలు, గొర్రెలు, కోళ్ళకు ఉచితంగా అన్ని వైద్య పరీక్షలు చేసి ఇంజక్షన్లను మందులను ఇచ్చారు. డా. స్రవంతి, సిబ్బంది వెంకటకుమార్, జ్యోతి, నాగమణి, గౌతమి, స్వాతి, వెటర్నరీ అసిస్టెంట్ కె.శంకరయ్య, గోపాలమిత్రలు మునిశేఖర్, మునికృష్ణ, హరి తదితరులు శిబిరంలో పాల్గొన్నారు.

# పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం విజయవంతం

## సీఐ శివకుమార్ రెడ్డి

సత్యవేడు, అక్టోబర్ 25, ప్రభాతవార్త:

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా సత్యవేడు సీఐ శివకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరంను విజయవంతమైంది. ఈ సందర్భంగా సీఐ శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ రక్తదానం మరొకరికి ప్రాణదానమన్నారు. ఈ రక్తదాన శిబిరాన్ని తిరుపతి ఎస్వీఎస్ బ్లడ్ బ్యాంకు సూపర్‌వైజర్ రఘు, సాంకేతిక నిపుణులు కృష్ణ, బాలుల ఆధ్వర్యంలో నిర్వహించామన్నారు. ఈ రక్తదాన శిబిరంలో సుమారు 100మంది రక్తదానం చేసినట్లు ఆయన తెలియజేశారు. ఈ రక్తదాన శిబిరంలో సత్యవేడు సర్కిల్‌లోని ఎస్‌లై



పురుషోత్తంరెడ్డి, వీరాంజనేయులు, నాగార్జున్ రెడ్డి, సత్యవేడు సర్పంచ్ మంజులా రమేష్, పంచాయితీ సెక్రటరి మునిరవికుమార్, పలువురు పోలీసులు నుండి 300ఎమ్ఎల్ రక్తంను సేకరించినట్లు సాంకేతిక నిపుణులు కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కమ్యూనిటీ వైద్యులు విద్యాసాగర్, ఏఎస్ఐలు చంద్రశేఖర్, భాస్కర్, హెడ్ కానిస్టేబుల్ రెడ్డి శేఖర్, పోలీసులు కృష్ణారావు, మురళి, మహిళా పోలీసులుజ్యోత్స్న యాదవ్, సునీత, ధనలక్ష్మి, కుసుమ, కె.ప్రత్యూష, చంద్రకళావతి, సుకన్య, దుర్గాభవాని, నిహారిక, ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్ 1 నుంచి శ్రీకాళహస్తీశ్వరాలయంలో కెమెరాలు నిషేధం

శ్రీకాళహస్తి, అక్టోబర్ 27 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో రాబోవు రోజుల్లో భక్తుల రద్దీని పరిగణలోకి తీసుకొని పలు సంస్కరణలు, కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నట్లు ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు గురువారం తెలిపారు. కార్తీక మాసంతో పాటు ఆలయంలో పవిత్రను కాపాడటానికి తిరుమల తరహాలో కొన్ని నిర్ణయాలు తీసుకోనున్నట్లు శ్రీనివాసులు వివరించారు. ముఖ్యంగా నవంబర్ 1 నుంచిఆలయంలోనికి సెల్ ఫోన్లతో పాటు కెమెరాలను నిషేధిస్తున్నట్లు వివరించారు. ఆలయానికి సంబందించిన ఉద్యోగులు అయినా సెల్‌ఫోన్లు లోపలకు తీసుకుపోరాదన్నారు. సిబ్బందికి వాకీటాకిలను అందిస్తున్నట్లు తెలిపారు. ఇక ఆలయంలోని 'కెమెరాలను, మీడియా కెమెరాలను'కట్టడిచేస్తున్నామని తెలిపారు. ఇక ఆలయంలో నిర్వహించే అభిషేకాలకు సంప్రదాయ దుస్తులతోనే అనుమతిస్తున్నామని రాబోవు రోజుల్లో ఎవరు అంతరాలయంలోనికి వెళ్ళాలన్నా సంప్రదాయ దుస్తులతోనే అనుమతించుటకు చర్చించి నిర్ణయం తీసుకున్నామని వివరించారు. మీడియాకు దేవస్థానమే కెమెరా మెన్‌ను ఏర్పాటు చేసి వీడియోలు, ఫోటోలు అందిస్తామని శ్రీనివాసులు వివరించారు.

## కళ్యాణ వెంకన్నను దర్శించుకున్న మంత్రి



చంద్రగిరి, అక్టోబర్ 27 ప్రభాతవార్త:

శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారిని గురువారం దేవాధాయ ధర్మాధాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి వారికి దర్శన ఏర్పాట్లు గావించి, వేద ఆశీర్వాదం, స్వామి వారి తీర్ధప్రసాదాలు, అందించారు. ఈ క్రమంలో ఆలయ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్స్ దాసరి రమణయ్య, ముని చెంగల్రాయులు, ఆలయ ప్రధాన అర్చకులు బాలాజీ రంగాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డిచే ప్రత్యేక పూజలు



పెద్దపంజాణి, అక్టోబర్ 27 ప్రభాతవార్త

మండలంలోని కెళవాతి గ్రామంలో శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ పున: ప్రతిష్ట చేపట్టిన 48 రోజుల అనంతరం గురువారం రాష్ట్ర మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి కుటుంబీకులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి సోదరుడు శ్రీనాథ్‌రెడ్డి, అనూషారెడ్డి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిని కలిసిన పేర్నాటి దంపతులు



కోట, అక్టోబర్ 27 ప్రభాతవార్త

తూర్పురాయలసీమ పట్టభద్రల వైకాపా అభ్యర్ధి పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ది సంస్ద చైర్మెన్ పేర్నాటి సుస్మిత రెడ్డిలు గురువారం నెల్లూరు జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిసి పుష్పగుచ్చాన్ని అంద చేశారు.

## కుమారస్వామి మండపం జీర్ణోద్ధారణకు బాలాలయ స్థాపన



శ్రీకాళహస్తి, అక్టోబర్ 27 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ఆలయాల అభివృద్ధికి పురాతనమైన ఆలయాలు మండపాల జీర్ణోద్ధారణకు నిర్ణయం తీసుకున్నామని ఆలయ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అతి పురాతనమైన కుమారస్వామి కొండ దిగువన వినాయక ఆలయం ఉంది. ఈ మండపం శిధిలావస్థకు చేరుకుంది. దీనిని పునర్నిర్మించుటకు చర్యలు తీసుకున్నామని ఈమేరకు బాలాలయ స్థాపన కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు. మండపంలో కలశ స్థాపన చేసామన్నారు. ఈ మండపం వద్దకు స్వామి అమ్మవార్లు శివరాత్రి, ఆడికృత్తిక సందర్బంగా ప్రతిష్టించి పూజలు నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు జీర్ణోద్ధారణకు బాలాలయ స్థాపన జరిపామన్నారు. సుమారు రూ.10లక్షలతో పనులు చేపట్టామన్నారు. దీనిని ఆధునీకరించుటకు చర్యలు తీసుకున్నామన్నారు. ఆలయానికి అనుబంధంగా ఉన్న మరో ఆలయాల్లో జీర్ణోద్ధారణకు ఆలయ ప్రదానార్చకులు డాక్టర్ స్వామినాధన్ గురుకుల్‌ను కోరామని తెలిపారు. ఇందులో చక్రేశ్వరస్వామి ఆలయం, చల్లేశ్వరస్వామి ఆలయం, అర్ధనారీశ్వరాలయం, నీలకంఠేశ్వరాలయం, అగస్తీశ్వరాలయం బేరివారి మండపం సమీపంలోని వినాయక ఆలయాలు ఉన్నాయని చైర్మెన్ వివరించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముందు వీటిని బాగు చేయటానికి ప్రణాళిక రూపొందించామని శ్రీనివాసులు తెలిపారు. ఈ జీర్ణోద్ధారణ పనులకు టెండర్ల ప్రక్రయ పూర్తి చేసామని తెలిపారు.

# గోడౌన్ల నిర్మాణాలు మరింత వేగవంతం

### - వీడియో కాన్ఫరెన్స్‌లో పాడి పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి బాబు అహ్మద్

చిత్తూరు, అక్టోబర్ 27 ప్రభాతవార్త:

పాలి పరిశ్రమ, కటింగ్ రంగాల్లో ప్రభుత్వం అత్యాధునిక సేవలు అందించడానికి, మంచి ధర వచ్చినపుడు రైతులు తమ పంటల ఉత్పత్తులను అమ్ముకోవడానికి అనుగుణంగా గోడౌన్ల నిర్మాణాలు చేపట్టిందని దీనిని మరింత వేగంగా నిర్మించి పూర్తి చేయాలని పాడి పరిశ్రమ శాఖ ముఖ్య కార్యదర్శి బాబు అహ్మద్ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్లు, సహకార, పశుసంవర్ధకశాఖ అధికారులతో గురువారం పాడిపరిశ్రమ శాఖ ముఖ్య కార్యదర్శి బాబు అహ్మద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ విత్తనం నుండి విత్తనాలు అమ్మకం వరకు రైతుకు ఉపకరించేలా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉత్పత్తులు వచ్చినపుడు సరైన గిట్టుబాబు ధర లేకుంటే నిల్వ చేసుకోవడానికి గోడౌన్ల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ఈ గోడౌన్ల నిర్మాణాలను వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్ మాట్లాడుతూ జిల్లాలో 32 భవనాలకు సంబంధించి నిర్మాణాలు జరుగుతున్నాయని ఆయనకు వివరించారు. అలాగే మరో 98 భవనాల నిర్మాణాలకు సంబంధించి స్థల సేకరణ జరుగుతుందన్నారు. అలాగే బిఎంసియులకు సంబంధించి స్థల సేకరణ పూర్తి చేశామని పనులు ప్రారంభించాల్సి వుందన్నారు. అలాగే ఎఎంసియుల నిర్మాణాలకు స్థల సేకరణ ప్రక్రియ వేగవంతంగా చేస్తున్నామన్నారు. అలాగే రైతు భరోసా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టాలని ఇలా చేయడం ద్వారా బ్యాంకింగ్ సమస్యలు రైతు భరోసా కేంద్రాల ద్వారా తీర్చడం జరుగుతుందన్నారు. రైతులు తమ ఉత్పత్తులను నిల్వ చేసుకొన్నప్పుడు



రుణం పొందడం సులభం అవుతుందన్నారు. ఈ ప్రక్రియ దేశ వ్యాప్తంగా జరుగుతుందని దీనిని వేగవంతం చేయాలని పాడి పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి బాబు అహ్మద్ పేర్కొన్నారు. అలాగే భవన నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని లేకుంటే నిర్మాణాలు నిలిచిపోయే ప్రమాదం వుందని ఆయన తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో చిత్తూరు నుండి పశుసంవర్ధకశాఖ జెడి వెంకట్రావ్, జిల్లా సహకార అధికారి బ్రహ్మానందరెడ్డి తదితరులు

# పట్టభద్రుల ఓట్లపైనే అన్ని పార్టీల దృష్టి

కోట, అక్టోబర్ 27 ప్రభాతవార్త

రానున్న మార్చిలో పట్టభద్రుల ఎంఎల్‌సీ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఉంచుకొని ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా తయారీపై దృష్టి పెట్టింది. తూర్పురాయలసీమ పట్టభద్రుల వైసీపీ అభ్యర్థిగా పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా కంచర్ల శ్రీకాంత్ బరిలో ఉన్నారు. పీడీఎఫ్ తరపున మీగడ వెంకటేశ్వర్లురెడ్డి బరిలో నిలిచారు. ఈ అభ్యర్థుల మధ్య ప్రధానంగా పోటీ నెలకొనడంతో అన్ని నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించి ఆయా పార్టీల నాయకులు అనుచర వర్గాన్ని కలుసుకుంటున్నారు. ఇప్పటికే వైసీపీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంఎల్‌సీలను కలుసుకొని మండల స్థాయి సమావేశాలు ఏర్పాటు చేసుకుంటూ పట్టభద్రులను ఓటర్లుగా చేర్పించడంపై దృష్టి సారించారు. ఓటర్ల చేర్పులకు మరో 12 రోజులే గడువు ఉంది. ఇదే పరిస్థితి కొనసాగితే ఓట్లు తక్కువగానే నమోదు కానున్నాయి. ప్రకాశం జిల్లాలో 37 వేల 542 మంది పట్టభద్రులు గత 26 రోజులకు ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. అదే జిల్లాలో ఉపాధ్యాయులు 571 మంది తమ ఓటు హక్కు కోసం దరఖాస్తులు చేసుకోవడం గమనార్హం. ఉద్యోగ, ఉపాధి రీత్యా ఎక్కువ శాతం పట్టభద్రులు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. వారంతా ఆన్‌లైన్‌లోనే ఓట్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఎన్నిక రోజు ఓటు హక్కు వినియోగించుకుంటారా లేదా అనే విషయంపై అన్ని పార్టీల్లో చర్చ నడుస్తోంది. సీనియర్ సహాయకుల హోదాలో పనిచేసే ఉపాధ్యాయులు కూడా పట్టభద్రుల విభాగంలో దరఖాస్తులకు అర్హులే. వీరిలోనూ నాలుగోవంతు కూడా దరఖాస్తులు చేసుకోకపోవడం గమనార్హం. ఓటరు కార్డు ఉన్న ప్రాంతాల్లోనే దరఖాస్తులు చేసుకోవాలని అధికార యంత్రాంగం సూచించడంతో మరో ప్రాంతంలో నివాసం ఉంటున్న ఉపాధ్యాయులు అందుకు అనాసక్తి చూపుతున్నట్లు సమాచారం. ప్రధాన ఎన్నికలు కాదు కదా అనే భావన కొందరు పట్టభద్రుల్లో ఉండటం, మండల, గ్రామస్థాయి అధికార యంత్రాంగం ఓటర్ల చేర్పుపై ప్రచారం చేయకపోవడంతో ప్రక్రియ మందకొడిగా సాగడానికి కారణమని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## అప్పు తిరిగి ఇవ్వలేదని తెదేపా నాయకుడు ఆత్మహత్య

శ్రీకాళహస్తి, అక్టోబర్ 27 ప్రభాతవార్త



ఆత్మహత్యచేసుకున్న సంపత్

అప్పుగా ఇచ్చిన డబ్బు ఇవ్వలేదని ఓ తెలుగుదేశంపార్టీ నాయకుడు ఆత్మహత్య చేసుకుని మృతిచెందిన సంఘటన శ్రీకాళహస్తిలో చోటుచేసుకుంది. దీంతో తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తల్లో విషాదం చోటుచేసుకుంది. పోలీసుల కధనం మేరకు.. పట్టణంలోని ఓటేరుకాల్వవీధిలో నివాసం ఉంటున్న తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు సంపత్ పట్టణంలోని విఎంపల్లిలో నివాసం ఉంటున్న ఓ వ్యక్తికి తన భార్య ఊహ వద్ద ఉన్న రూ.6లక్షలు అప్పుగా ఇచ్చాడు. దీంట్లో రూ.3లక్షలు అప్పుతీసుకున్నవారు ఇచ్చినా మిగిలిన రూ.3లక్షలు అడగడం కోసం గురువారం విఎంపల్లిలో ఉన్న నివాసానికి వెళ్ళగా వివాదం చోటుచేసుకుంది. దీంతో ఇంట్లో వారందరినీ పంపించివేసి తలుపులు వేసుకుని తాను ఆత్మహత్యలేఖ రాసుకుని జేబులో పెట్టుకుని తనతో తెచ్చుకున్న పాయిజన్ బాటిల్‌ను తాగి ఆత్మహత్యచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. దీన్ని గుర్తించిన వారు హుటాహుటిన ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. దీనిపై కేసునమోదు చేసినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుధీర్‌రెడ్డి వెంటనే ఆస్పత్రికి చేరుకుని పరిశీలించారు. అప్పటికే మృతిచెందడంతో ఓమంచినాయకున్ని కోల్పోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మృతికి పార్టీ నాయకులు రంగినేనిచెంచయ్యనాయుడు, ప్రకాష్‌నాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్, ఉపాధ్యక్షుడు పోలూరుశ్రీనివాసులురెడ్డి, ఉమేష్‌రావు, జిలానీ, తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్, మహిళా అధ్యక్షురాలు చక్రాల.ఉష, పలువురు తెదేపా నాయకులు తమ సంతాపాన్ని వ్యక్తంచేశారు. ఈసందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ సంపత్ మృతికి కారకులైన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్‌చేశారు.

## పక్కాగా ప్రత్యేక టీకాల ప్రణాళిక

### - జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు



చిత్తూరు, అక్టోబర్ 27 ప్రభాతవార్త:

ప్రత్యేక టీకాల ప్రణాళికను పక్కాగా రూపొందించి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం డిఐఓ డాక్టర్ రవిరాజు, డిపిఎంఓ డాక్టర్ శ్రీనివాసరావులు జిల్లాలోని సిహెచ్‌ఓలు, ఎంపిహెచ్ఇఓలు, పిహెచ్ఎన్‌లు, హెచ్ఇలు, ఎల్‌డి కంప్యూటర్స్‌తో వ్యాధి నిరోధక టీకాలు, గర్భవతుల నమోదు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో డిఐఓ డాక్టర్ రవిరాజు మాట్లాడుతూ పిహెచ్‌సిల పరిధిలో గర్భవతుల నమోదు శాతం పెంచి, ప్రసవాల నమోదు కార్యక్రమంను పెంచి లక్ష్యాలను పూర్తి స్థాయిలో అధికమించాలన్నారు. అలాగే మళ్ళీ కరోనా పాజిటివ్ కేసులు నమోదు అవుతున్న దృష్ట్యా ఫ్రంట్‌లైన్ వర్కర్లు బూస్టర్ డోస్ వేయించాలన్నారు. ఇప్పటికీ బూస్టర్ డోస్ వేయించుకోని వారిని గుర్తించి ఇంటింటికి వెళ్ళి బూస్టర్ డోస్‌ను వేయాలన్నారు. డిపిఎంఓ డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ కుటుంబ సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి 90 శాతం కంటే ఎక్కువ సాధించి లక్ష్యాలను చేరుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో మాతా శిశు సంరక్షణ సేవలను మరింత విస్తృతం చేయాలన్నారు. అలాగే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంను విస్తృతంగా చేపట్టి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఓ రమేష్‌రెడ్డి, డిపిహెచ్ఎన్ఓ రేణుకప్రభ, డిఎంఓ డాక్టర్ శ్రీనివాసులు, ఎపిడమాలజిస్ట్ శ్రీవాణి, డిపిఓ రామ్మోహన్, నోడల్ అధికారులు, సిహెచ్ఓలు, ఎంపిహెచ్ఇఓలు తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో ఓ మోస్తరుగా భక్తులు 18వేల మంది దర్శనం

శ్రీకాళహస్తి, అక్టోబర్ 27 ప్రభాతవార్త

దక్షిణ కైలాసంగాప్రఖ్యాతి చెందిన వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో గురువారం భక్తులు ఓ మోస్తరుగా ఉన్నారు. దేవస్థానం సాయంత్రం అదించిన వివరాల మేరకు 18వేల మంది దర్శనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా స్వామి అమ్మవార్ల సుదర్శనం, సత్వర దర్శనం చేసుకున్నారని వివరించారు. రాహుకేతుదోష నివారణ పూజలు, అభిషేకాలు పరిమితంగానే జరిగినప్పటికి సామాన్య భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

## డిజిటల్ లావాదేవిల ద్వారా ఆర్థిక క్రమశిక్షణ

### - డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ



చిత్తూరు, అక్టోబర్ 27 ప్రభాతవార్త:

డిజిటల్ లావాదేవిల ద్వారా ఆర్థిక క్రమశిక్షణ, పారదర్శకత వుంటుందని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ డిఎంకె తులసీ పేర్కొన్నారు. స్థానిక బివి రెడ్డి కాలనీలోని ఇండియన్ బ్యాంక్ స్వయం ఉపాధి శిక్షణా కేంద్రంలో గురువారం స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక ప్రణాళికపై అవగాహన, శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ మాట్లాడుతూ జిల్లాలోని 3.5 లక్షల మంది ఎస్‌హెచ్‌జి గ్రూపులకు సంబంధించి సభ్యుల బ్యాంకు ఖాతాలు దేశ వ్యాప్తంగా వున్న ఎన్ఆర్ఎల్ఎంలో రిజిస్టర్ అయ్యిందన్నారు. స్వయం సహాయక సంఘాల డిజిటల్ ఆర్థిక లావాదేవిలపై బ్యాంకు లింకేజీ అధికారులు గతంలో శిక్షణ పొందారన్నారు. అలాగే జిల్లాలో 300 మంది ఎస్‌హెచ్‌జి సభ్యులను ఎంపిక చేసి వారికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. వీరు జిల్లాలోని మిగిలిన స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు ఈ విధానంపై అవగాహన కల్పించాలన్నారు. డిజిటల్ లావాదేవిల వల్ల సంఘాల ద్వారా సభ్యులు పొందే రుణాలు, చెల్లింపుల్లో పారదర్శకత వుంటుందన్నారు. సంఘాల్లోని సభ్యులు వారి పొదుపు నిల్వలను పరిశీలించుకోవచ్చునన్నారు. అలాగే బ్యాంకుల ద్వారా సంఘ సభ్యులు పొందే రుణాలు, వాటికి సంబంధించిన వడ్డీ, చెల్లింపుల వివరాలు పరిశీలించుకోవచ్చునన్నారు. సంఘ సభ్యులు నేరుగా ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేయవచ్చునన్నారు. అలాగే ఎస్‌హెచ్‌జిల ద్వారా బ్యాంకుల్లో తీసుకొంటున్న రుణాలకు సంబంధించి చెల్లింపులు సకాలంలో చేస్తుండటంతో బ్యాంకులు సైతం రుణాలు మరిన్ని మంజూరు చేయడానికి ముందుకు వస్తున్నాయన్నారు. అలాగే సంఘాలకు ఇచ్చే రుణాలు కాకుండా సంఘ సభ్యుల్లో ఇద్దరు ఎంటర్ ప్రమ్యయర్‌లకు సైతం దాదాపు 10 లక్షల రూపాయల వరకు రుణాలు ఇస్తారన్నారు. ఎల్డీఎం శేషగిరిరావు మాట్లాడుతూ ఈ ట్రైనింగ్ ద్వారా శిక్షణ పొందిన సభ్యులు మిగిలిన సంఘ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు సంబంధించి ఆర్‌బిఐ సమకూర్చిన మెటీరియల్‌ను గ్రూప్ సభ్యులకు అందించడం జరుగుతుందన్నారు. ఇందులో ఫైనాన్షియల్ లిటరసీకి సంబంధించిన అంశాలు వున్నాయని వీటిని సభ్యులు అవగాహన చేసుకోవాలన్నారు. నాబార్డు డిడిఎం సునీల్ మాట్లాడుతూ సంఘ సభ్యులకు ఫైనాన్షియల్ లిటరసీపై ఇస్తున్న ఆరు రోజుల శిక్షణ ఎంతో ప్రాముఖ్యత సంతరించుకొందన్నారు. మన రాష్ట్రంలో గతంలో కంటే అక్షరాస్యత మెరుగ్గా వుందని, అవకతవకలు, మోసాలకు తావు లేకుండా ఆర్థిక లావాదేవిలు నిర్వహించుకోవడానికి ఫైనాన్షియల్ లిటరసీ అవసరం అన్నారు. ఈ యాప్ వినియోగించడం ద్వారా వివిధ బ్యాంకుల ద్వారా పొందుతున్న రుణాలు, వడ్డీ, రుణ చెల్లింపులు, పొదుపు ఖాతాలు మొదలైన వివరాలు తెలుసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ బ్యాంకు ట్రైనింగ్ సెంటర్ మేనేజర్ శ్రీనివాసన్, కార్యక్రమ నిర్వాహకులు అనిల్‌కుమార్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో బాత్‌రూంలు పరిశుభ్రంగా ఉండాలి

### -ఆర్‌జెడి వెంకటరమణారెడ్డి



బాలుర ఉన్నత పాఠశాలలో క్లీనింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్‌జెడి వెంకటరమణారెడ్డి

.శ్రీకాళహస్తి, అక్టోబర్ 27 ప్రభాతవార్త

పాఠశాలల్లో బాత్‌రూంలు పరిశుభ్రంగా ఉండాలని ఆర్‌జెడి వెంకటరమణారెడ్డి అన్నారు. నాడు నేడు కార్యక్రమంలో భాగంగా ఈటిసిలో నిర్వహిస్తున్న వెలుగు ఎపిఎంల శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిధిగా విచ్చేసి తొలిరోజు కార్యక్రమంలో పలుసూచనలు ఇచ్చిన ఆయన రెండో రోజు వెలుగు ఎపిఎంలను పాఠశాలల్లో ప్రభుత్వం అందిస్తున్న కార్యక్రమాలుపై అవగాహన కల్పించారు. గురువారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా వెలుగు ఎంపిలతో సందర్శించారు. పాఠశాలలో సైన్సు ల్యాబ్, తరగతి గదులు, పాఠశాల పరిసరాలు తనిఖీచేశారు. అయితే సైన్సు ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం బాత్‌రూంలను పరిశీలించి అక్కడ ఉన్న క్లీనింగ్ సిబ్బందిని ప్రశ్నించారు. బాత్‌రూంలు ఎలా శుభ్రం చేయాలని, పరిశుభ్రత సామగ్రిని ఇస్తున్నారా?లేదా? అని సంబందిత వారి నుంచి అడిగి తెలుసుకున్నారు. అయితే ఇక్కడ విద్యార్థుల సౌకర్యార్థం ప్యూరిఫయర్ వాటర్ పరికరం పనిచేయడం లేదని గమనించిన ఆయన వెంటనే మరమ్మత్తులు చేయించి వాడుకలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఆయనతో పాటు ఎంఈవో భువనేశ్వరి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, ఉపాధ్యాయులు, సీనియర్ అసిస్టెంట్ మధులతో శిక్షణకు హాజరైన సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం తొండమనాడు ఉన్నత,ప్రాధమిక పాఠశాల, భాస్కపేటలోని ప్రాధమిక పాఠశాలలను మరో బృందం పరిశీలించింది. కార్యక్రమంలో హెచ్ఎం సురేష్, ఎస్ఎస్ఏ జిల్లా అధికారి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పైసా రైతుల అభివృద్ధి కోసమే ఖర్చు

### సింగిల్ విండో చైర్మన్‌గా మల్లం చంద్రమౌళి రెడ్డి ప్రమాణం

చంద్రగిరి, అక్టోబర్ 27 ప్రభాతవార్త:

నరశింగాపురం సహకార సంఘం (సింగిల్ విండో) ఆధ్వర్యంలో ప్రతి పైసా రైతుల అభివృద్ధి కోసమే ఖర్చు చేస్తామని సింగిల్ విండో చైర్మన్‌గా మల్లం చంద్రమౌళి రెడ్డి అన్నారు. నరశింగాపురం బ్యాంక్ ఆవరణలో గురువారం నిరాడంబరంగా జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన రెండవ పర్యాయం సింగిల్‌విండో చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరశింగాపురం బ్యాంక్ పరిధిలోని ప్రతి రైతు సేద్యం ద్వారా ఆర్ధికంగా బలోపేతమై రొమ్ము విరుచుకుని ఆత్మభిమానంతో జీవించే విధంగా నిధులు కేటాయించి చేయూతను ఇస్తామన్నారు. అదేవిధంగా బ్యాంక్ నుండి రుణాలు పొందిన రైతులు బ్యాంక్ అభివృద్ధికై సకాలంలో క్రమం తప్పకుండా రుణాలు తిరిగి చెల్లించాలన్నారు. కాగా తొండవాడకు చెందిన మల్లం చంద్రమౌళి రెడ్డి రాజకీయంగా ఏ పార్టీలో వున్నప్పటికీ తనదైన శైలి మార్కు రాజకీయం చేయడంలో సమర్ధవంతుడుగా ఇప్పటికే పలుమార్లు రుజువు చేసుకున్నారు. ప్రస్తుతం తొండవాడ సర్పంచ్‌గా మల్లం దీపిక చంద్రమౌళి రెడ్డి (భార్య), ఎంపిటిసి తను బలపరిచిన అభ్యర్థి నిర ఒజన్ (ఎస్సీ రిజర్వ్‌డ్) ను గెలిపించుకోవడంతో పాటు వైఎస్ ఎంపిపిగా చేయడానికై ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని మెప్పించారనడంలో సందేహం లేదు. అదేవిధంగా ఇప్పటికే ఒకసారి నరశింగాపురం సింగిల్ విండో చైర్మన్‌గా పనిచేసిన మల్లం చంద్రమౌళి




రెడ్డి తన పదవీ కాలం ముగియడంతో తన తండ్రి మల్లం విశ్వనాథ్ రెడ్డిని త్రీమ్యాన్ కమిటీ అధ్యక్షుడుగా నియమించుకోవడంలో ఎంఎల్ఏ ఆశీస్సులు అందుకున్నారు. మరోమారు తన పట్టుదల, పనితీరుతో త్రీమ్యాన్ కమిటీ ద్వారా అధ్యక్షుడుగా తనను నియమించుకోవడంలో ఎంఎల్ఏని మెప్పించారు. ఈ నేపథ్యంలో మల్లం దంపతులను పలువురు ప్రజా ప్రతినిధులు, అభిమానులు, రైతులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి చిల్లకూరి యుగంధర్ రెడ్డి, ఎంపిటిసి అశ్వినీ ప్రవీన్‌కుమార్, సర్పంచ్ చెంచురత్నం శెట్టి, చేగు గ్రూపు సంస్థల అధినేత చేగు గోవర్ధన్ గుప్తా, మేనేజర్ నాగేంద్ర ప్రసాద్, అకౌంటెంట్ మావిళరెడ్డిగారి భాస్కర్ రెడ్డి, బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.